

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 18, మే 2025



జిల్లాలోని ఎక్సైజ్‌శాఖలో అంతర్యుద్ధం నడుస్తోంది. మద్యం దుకాణాల నుంచి వసూలు చేసిన మామూళ్లు, ఇతరత్రా సొమ్ము పంపకాల విషయంలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఇందుకు కారణమైంది. దీంతో మిగిలిన అధికారులు, కిందిస్థాయి సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మద్యం దుకాణాలపై పర్యవేక్షణను గాలికొదిలేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేసుకుంటున్నారు. దీన్ని అవకాశంగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు తోసిరాజని మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దుకాణాల వద్దనే సిట్టింగ్స్, చీర్స్ కొనసాగిస్తున్నారు. సమయపాలన పాటించకపోవడంతో అర్ధరాత్రి కూడా గ్లాసులు గలగలలాడుతున్నాయి. ఊరూరా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యాడు.

మా వాటా మాకు ఇవ్వాల్సిందే!

అధికారులు కొంత మంది లెక్క ప్రకారం 174 దుకాణాలకు సంబంధించి వాటాలు వేయమని చెబుతుండగా, వసూలైన డబ్బు మాత్రమే వచ్చిన వరకు ఇస్తామని మరికొంతమంది అంటున్నారు. మద్యం దుకాణాల నిర్వాహకుల్లో ఉన్న కొందరు టీడీపీ నాయకులు మామూళ్లు ఇవ్వలేదని, వాటితో ప్రమేయం లేకుండా మిగిలినవి పంచుకుందామని కొందరు ప్రతిపాదించారని తెలిసింది. అందుకు మిగిలినవారు ససేమిరా అన్నట్లు సమాచారం. దీంతో భేదాభిప్రాయాలు వచ్చాయి. సిబ్బందికి ఒక్కరూపాయి కూడా ముట్టలేదు. ఇదేసమయంలో అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఓ జిల్లాస్థాయి అధికారిపై నేరుగా మద్యం వ్యాపారులే గతంలో ఫిర్యాదు చేశారు. మరో అధికారి పశ్చిమప్రాంతానికి వెళ్లి మద్యం వ్యాపారులను వేధిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. దీనంతటికీ అధికారులు, సిబ్బంది మధ్య వచ్చిన పొరపొచ్చాలే కారణమన్న ప్రచారం కూడా నడుస్తోంది. ఇదేఅదనుగా మద్యం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నారు.

బార్లను తలపించేలా పర్మిట్ రూంలు



జిల్లాలో ఉన్న అన్ని మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా బార్లను తలపించేలా పర్మిట్ రూంలు ఏర్పాటు చేసి సిట్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. అక్కడే టచ్చింగ్‌కు అవసరమైన ఫుడ్, వాటర్ బాటిళ్లు, గ్లాసులు, సోడాలు విక్రయిస్తున్నారు. ఒంగోలు నగరంలోని దాదాపు అన్ని మద్యం దుకాణాల వద్ద ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇలా అనధికారికంగా మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌లు ఏర్పాటు చేసినా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. నెలవారీ మామూళ్లు అందితే చాలుఅన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నారు.

ఎక్సైజ్‌లో కోల్డ్‌వార్

మద్యం వ్యాపారుల నుంచి భారీగా మామూళ్లు వసూలు

పంపకాల విషయంలో పేచీ

- అధికారుల వ్యవహార శైలిపై
- కిందిస్థాయి సిబ్బంది గుర్రు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- లిక్కర్ షాపులపై పర్యవేక్షణ కరువు
- ఇష్టానుసారంగా వ్యాపారుల తీరు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- అనధికారికంగా పర్మిట్ రూంలు
- సమయపాలన ఊసే కరువు

ఒంగోలు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖలో పాలన గాడి తప్పింది. మద్యం దుకాణాలపై పర్యవేక్షణ కొరవడింది. అధికారులు, సిబ్బంది 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అదనపు ఆదాయమే పరమావధి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి వసూలు చేసిన నగదు పంపకం విషయమై ఆ శాఖలో కోల్డ్‌వార్ నడుస్తోంది. వైన్ షాపులకు లైసెన్సులు జారీ చేసినప్పుడు గుట్టుగా ఒక్కో షాపునకు రూ.లక్ష చొప్పున సుమారు రూ.1.50కోట్లు ఎక్సైజ్ అధికారులు వసూలు చేశారు. అదేసమయంలో నెలవారీ మద్యం దుకాణానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మామూళ్లు దండుకుంటున్నారు. మద్యం వ్యాపారులు ఎక్కడికక్కడ సిండికేట్‌గా మారడంతో దానికి నాయకత్వం వహించే వారే అన్ని షాపుల నుంచి నెలవారీ మామూళ్లను వసూలు చేస్తున్నారు. వీటిలో కొన్ని ఎక్కడికక్కడ ఎక్సైజ్ స్టేషన్ల బాధ్యులకు అందుతుండగా, మరికొంత మొత్తాన్ని సిండికేట్ లీడర్ల వద్దనే ఉంచారు. మరికొన్ని చోట్ల అధికారులే జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

ఊరూరా బెల్ట్ షాపులు

ప్రాంతాల వారీగా ఏర్పడిన మద్యం సిండికేట్లు గ్రామాల్లో బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో గ్రామంలో రెండు నుంచి మూడు గొలుసు దుకాణాలను ఏర్పాటు చేసి మిగతా 6లో...

పైసల్లేకుండా పరీక్షలెలా?



- విడుదల కాని రూ.1.50 కోట్ల బకాయిలు
- రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఒంగోలు విద్య, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యాశాఖ అధికారులకు పెద్ద సంకటం వచ్చి పడింది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా సోమవారం నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో వారు మల్లగుల్లాలు పడుతున్నారు. గత ఏడాది మేలో జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన రూ.1.50 కోట్ల బకాయిలను ప్రభుత్వం ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. అప్పట్లో అధికారులు అప్పులు తెచ్చి నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అసలు బడ్జెట్ ఇవ్వలేదు. సర్టిఫికెట్లు, డిప్లమో వంటి మైనర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి రెండేళ్లుగా నిధులు విడుదల కాలేదు. హెచ్‌ఎంలు, టీచర్లకు పదో తరగతి, ఓపెన్ స్కూలు పదో తరగతి, ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించిన చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు గగ్గోలు పెడుతున్నారు.

పరీక్షల నిర్వహణకు బడ్జెట్ కేటాయించకపోవడంతో ఆందోళన

పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కనీసం రూ.1.40 కోట్లు అవసరమవుతాయి. అయితే ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షలకు సంబంధించి కేవలం రూ.85 లక్షలు మాత్రమే కేటాయించారు. ఆ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. కానీ ఖజానా నుంచి ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. గత ఏడాది మేలో నిర్వహించిన మిగతా 6లో...

35,220 దరఖాస్తులు

- మెగా డీఎస్సీకి ముగిసిన గడువు
- 21,046 మంది అభ్యర్థులు
- వీరిలో మహిళలే అధికం

ఒంగోలు విద్య, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీకి మొత్తం 35,220 దరఖాస్తులు వచ్చాయి. 21,046 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఒక్కొక్కరు సగటున 1.67 దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో మహిళలే అత్యధికంగా ఉన్నారు. గురువారం రాత్రితో స్వీకరణకు గడువు ముగిసింది. మెగా డీఎస్సీకి జిల్లాలో 629 పోస్టులు ప్రకటించారు. దరఖాస్తు చేసిన వారిలో మహిళలు పురుషుల కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా ఉన్నారు. పురుషులు 8,487 మంది, మహిళలు గరిష్ఠంగా 12,559 మంది దరఖాస్తు చేశారు. మహిళా అభ్యర్థులకు ప్రతి కేటగిరీలో 33శాతం రిజర్వేషన్లు ఉండటంతో టీచర్ పోస్టులకు వారే ఎక్కువ మంది ఎంపికవుతున్నారు. సగటున ఒక్కో పోస్టుకు 56 దరఖాస్తులు వచ్చాయి.

కేటగిరీ వారీగా దరఖాస్తులు ఇలా..

ఓసీలు 2,816మంది, బీసీ-ఏ 2,240 మంది, బీసీ-బీ 2,166 మంది, బీసీ-సీ 218 మంది, బీసీ-డీ 2,313 మంది, బీసీ-ఈ 1,434 మంది, ఎస్సీ గ్రేడ్-1, ఎస్సీ గ్రేడ్-2లో 4,522 మంది డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ గ్రేడ్-3లో 4,114, ఎస్టీ 1,221 మంది, ఈడబ్ల్యూఎస్ 1,833 మంది, దృష్టి లోపం ఉన్నవారు 81 మంది, వినికిడి లోపం ఉన్నవారు 78 మంది, శారీరక వైకల్యం ఉన్నవారు 574 మంది, మానసిక వికలాంగులు ఒక్కరు డీఎస్సీలో టీచర్ పోస్టులకు దరఖాస్తు చేశారు.

31న జడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 31వతేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాత జడ్పీ సమావేశపు హాలులో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- గ్రామ,వార్డు సచివాలయాల్లో క్యూఆర్ కోడ్
- అవగాహన కల్పించేందుకు శ్రీకారం 7

తాలూకా పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

- భార్య ఫిర్యాదుతో విచారణకు పిలిచిన పోలీసులు
- కత్తితో పొడుచుకున్న వైనం 6

విద్యాశాఖ మంత్రికి వాట్సాప్‌లో వినతులు

- తొమ్మిది రకాల సమస్యలపైనే అధికం

ఒంగోలు విద్య, మే 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వాట్సాప్‌లో వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన మెయిల్‌కు కూడా వీటిని పంపుతున్నారు. ఉపాధ్యాయులుకానీ, ఇతరులు కానీ ఎవరైనా సమస్యలను తన వాట్సాప్‌కు పంపిస్తే స్పందిస్తానని మంత్రి లోకేష్ ప్రకటించారు. పాఠశాల విద్య కమిషనర్ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఉపాధ్యాయులు నేరుగా విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు తమ తొమ్మిది డిమాండ్ల పరిష్కారం కోరుతూ వినతులు పంపుతున్నారు. ఫౌండేషన్ స్కూళ్లలో 1,2 తరగతులే కాకుండా 1నుంచి 5 తరగతులు కొనసాగిస్తూ కనీసం ఇద్దరు టీచర్లను నియమించాలని, విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనే అవకాశం కల్పించాలని, మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఎస్‌జీటీలను హెచ్‌ఎంలుగా నియమించాలని ఎక్కువ మంది కోరుతున్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటితే ఒక హెచ్‌ఎం, ఐదు ఎస్‌జీటీ పోస్టులు ఇవ్వాలని, హైస్కూళ్లలో 1నుంచి 5 తరగతుల విలీనం ప్రతిపాదనను విరమించాలని, హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు వారానికి 32 పీరియడ్ల పనిభారం మించకుండా చూడాలని తదితర సమస్యలతో లోకేష్‌కు వాట్సాప్‌లో వినతులు పంపుతున్నారు.





జరుగుమల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా..

- జిల్లావ్యాప్తంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర
- ఈ విడత బీట్ హీట్ పేరుతో ఎండల తీవ్రతను అధిగమించడంపై దృష్టి
- పలుచోట్ల మొక్కలు నాటి చలివేంద్రాలు ప్రారంభం
- పారిశుధ్య పనుల నిర్వహణ
- ప్రజాప్రతినిధులు హాజరు

ఒంగోలు, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రతినెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ఒక్కో అంశంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతోంది. అందులో భాగంగా ఈ శనివారం ప్రస్తుత వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రత నుంచి రక్షణ పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. అందుకోసం బీట్ ద హీట్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. పల్లె, పట్టణం తేడా లేకుండా జిల్లా అంతటా ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాకు చెందిన మంత్రి స్వామితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, గ్రామస్థాయి వరకు ఉండే ప్రజాప్రతినిధులు... కలెక్టర్ నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారు.

సదస్సులు, ర్యాలీలు

జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో మొత్తం సుమారు 11వేల మంది పర్యవేక్షణాధికారులు ఉండగా వారి ఆధ్వర్యంలో వేసవి జాగ్రత్తలపై అవగాహన సదస్సులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల చలివేంద్రాలను ప్రారంభించారు. భవిష్యత్‌లో పచ్చదనం కోసం విస్తృతంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వివిధ కార్యాలయాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన జరుగుమల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ చలివేంద్రాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా తొలుత కలెక్టరేట్ సముదాయమైన ప్రకాశం భవన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కొత్తపట్నం మండలం అల్లూరులో జరిగిన కార్యక్రమానికి మిగతా 6లో...



ఆగితే హాయిగుండేలా..

ఎండల తీవ్రత నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు స్థానిక చర్చి సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నెట్‌షెడ్‌ను ఏర్పాటు చేశారు. నెల్లూరు బస్టాండు వైపు నుంచి ట్రంకురోడ్డుకు వెళ్లే మార్గంలో ఈ సౌకర్యం కల్పించారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులకు ఎండ నుంచి ఉపశమనం కలిగి శరీరానికి హాయిగా ఉంటుంది.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ప్రాకారం లోపల ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

మహాకుంభాభిషేకానికి ఏర్పాట్లు

- క్యూలైన్లు, టెంట్‌లు సిద్ధం
- ప్రతి భక్తుడికి వాటర్ బాటిల్, మజ్జిగ ప్యాకెట్లు

అద్దంకి,మే17(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతిమండపం పునర్నిర్మాణం సందర్భంగా సోమవారం నిర్వహించే మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు అంతా సిద్ధమవుతోంది. సుమారు 10 వేల మంది భక్తులు వేచి ఉండే విధంగా ఆలయ ప్రాకారం లోపల, బయట క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్‌లోకి భక్తులు ప్రవేశించే సమయంలోనే వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్‌లు ఇవ్వనున్నట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. మహాకుంభాభిషేకానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఎండవేడిమి లేకుండా ఉండేవిధంగా దేవాలయం వద్ద నుంచి యాదవుల అన్నదాన సత్రం వరకు రోడ్డుపై టెంట్‌లు ఏర్పాటు చేశారు. తిరుణాళ్ల సమయంలో రంగుల రాట్నాలు ఉంచే ప్రాంతంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానంతోపాటు అన్ని సత్రాల్లో అన్నదానాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చక్కని భరోసా అని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో 27 మందికి రాష్ట్రప్రభుత్వం నుంచి విడుదలైన రూ.28,03,459 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం సామాన్య ప్రజలకు వైద్యం సాయం అందించే ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, కూటమి నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యావిధానంపై ప్రత్యేక దృష్టి

చీరాల : కూటమి ప్రభుత్వం విద్యా విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ఓట్ల హేమబిందు, మాచర్ల వెంకట హేమలత, అందె శ్వేత, కౌతవరపు ఉజ్వల, మర్రివాడ జ్యోష్ణప్రియలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున గాల నరేష్ కృషితో ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు ప్రోత్సాహం అందజేశారు. క్రమ శిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సూచించారు.

దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన ఆపరేషన్ సిందూర్

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- చీమకుర్తిలో ఉత్సాహంగా తిరంగా ర్యాలీ
- హాజరైన కూటమి నాయకులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, కూటమి నాయకులు

చీమకుర్తి, మే17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన వీరజవాన్ల ధైర్యసాహసాలను కీర్తిస్తూ శనివారం చీమకుర్తి పట్టణంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అగ్రభాగాన జాతీయజెండా చేతబూని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ఉత్సాహంతో ముందుకుసాగారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావటంతో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని పట్టణంలోని నెహ్రూనగర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ భారీ జాతీయపతాకంతో పెద్దఎత్తున దేశాభిమానాన్ని చాటుకుంటూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. అలాగే అశువులు బాసిన వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరు చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజాకవి పిన్నిక శ్రీనివాసరావు సిందూరం అనే పేరిట ఆపరేషన్ సిందూర్‌పై తాను రాసిన కవితను వినిపించి దేశభక్తిని చాటారు. కార్యక్రమంలో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జనసేన ఇన్‌చార్జి కందుకూరి బాబు, పీడీ జోసెఫ్, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరీ, మున్సిపల్ చైర్మన్ జి.రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు వరప్రసాద్, బొడ్డు శంకర్, అపర్ణ, బొడ్డపాటి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాలూకా పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన కాశీఈశ్వరరావు

ఒంగోలు క్రైం, మే17(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని తాలుకా పోలీస్‌స్టేషన్‌లో యువకుడు కత్తితో పొడుచుకుని ఆత్మహత్యయత్నం చేశాడు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక సత్యనారాయణపురంలో నివాసం ఉండే పల్లెబోయిన కాశీ ఈశ్వరరావు క్లోపేటకు చెందిన శైలజను మూడేళ్ళ క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి ఏడాది పాప ఉంది. అయితే ఇటీవల వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో శైలజ పుట్టింటికి వెళ్లి నాలుగు రోజుల క్రితం మరలా భర్త వద్దకు వచ్చింది. అయితే తన భర్త నిత్యం అనుమానిస్తున్నాడని తిరిగి శుక్రవారం తన పుట్టింటికి వెళ్ళింది. ఆ సమయంలో పాపను కాశీ ఈశ్వరరావు తన వద్దనే ఉంచుకున్నాడు. ఈమేరకు శనివారం ఉదయం శైలజ తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త నిత్యం వేధింపులకు గురిచేస్తూ తన బిడ్డను ఇవ్వకుండా ఆయన వద్దనే ఉంచుకున్నాడని పోలీసులకు తెలిపింది. ఈమేరకు తాలుకా పోలీసులు శనివారం రాత్రి కాశీ ఈశ్వరరావును స్టేషన్ కు పిలిచి విచారిస్తున్నారు. అక్కడే భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో తనతో తెచ్చుకున్న కత్తితో కాశీఈశ్వరరావు పొడుచుకున్నాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది అడ్డుకొని కత్తిని లాగేశారు. అయితే కాశీఈశ్వరరావుకు పొట్టలో గాయం కావడంతో వెంటనే రిమ్స్‌కు తరలించారు.

విచారణ చేస్తుండగా కత్తితో పొడుచుకున్నాడు...

భార్యాభర్తల మధ్య ఉన్న వివాదంపై కాశీఈశ్వరరావును పోలీస్‌స్టేషన్‌కు పిలిచినట్లు తాలుకా ఎస్‌ఐ ఫణిభూషణ్ తెలిపారు. అయితే తన వెంట తెచ్చుకున్న చిన్న కత్తితో మాట్లాడుతూనే పొడుచుకున్నాడని ఆయన చెప్పారు. వెంటనే రిమ్స్‌కు తరలించామని పేర్కొన్నారు.

దొంగ అరెస్టు

రూ.14.6లక్షల విలువ చేసే ట్రాక్టర్‌లు, రొటావేటర్ ట్రక్కులు స్వాధీనం



పట్టుకున్న ట్రాక్టర్, సామగ్రిని చూపిస్తున్న సీఐ ప్రభాకర్, ఎస్ఐ సంపత్ కుమార్

పుల్లలచెరువు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టరు అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. శనివారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రభాకర్, ఎస్ఐ సంపత్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్ షెడ్డులో ఉంచిన ట్రాక్టరు, రొటావేటర్‌ను దొంగలు అపహరించారు. బాధితులు శంకరరావు, వాగ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నిందితుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురం గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్ అలియాస్ మాస్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చేపట్టారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గుట్లపల్లి వద్ద హుస్సేన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు తాను చేసిన దొంగతనాల వివరాలను చెప్పాడు. పుల్లలచెరువు మండలంలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టర్, రొటావేటర్, ఐటీవరం గ్రామ సమీపంలో ఉన్న ట్రాక్టరు ట్రక్కు, త్రిపురాంతకంలో నిలిపి ఉన్న మంచినీటి ట్యాంకర్, ముటుకులలో ఇటుకల బట్టీ వద్ద ట్రాక్టరు ట్రక్కును దొంగిలించాడు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.14.6లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నిందితుడిని మార్కాపురం కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. అతి తక్కువ కాలంలో కేసును ఛేదించిన పుల్లలచెరువు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్‌లో కోల్డ్‌వార్

(5వ పేజీ తరువాయి)

మద్యం సరఫరా చేస్తున్నారు. ఎమ్మార్పీ కంటే క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులు ఒక్కో బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకూ పెంచి అమ్ముకుంటున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో మద్యం దుకాణాలలో కొన్ని బ్రాండ్‌లు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. కమీషన్లు ఎక్కువ వచ్చే కంపెనీల బ్రాండ్‌లు తెచ్చి విక్రయాలు చేస్తున్నారు.

తెల్లవారే సరికి తెరుచుకుంటున్న మద్యం దుకాణాలు

మద్యం దుకాణాల యజమానులు సమయపాలన పాటించడం లేదు. నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే మద్యం విక్రయాలు చేయాలి. కానీ అనేక ప్రాంతాల్లో ఉదయం 6 గంటలకే టీ షాపులా మద్యం దుకాణాలు బార్లాగా తెరుచుకుంటున్నాయి. రాత్రి 12 గంటల వరకు విక్రయాలు చేస్తున్నారు. నగరంలో పరిస్థితి ఇలా ఉండగా.. పశ్చిమంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలలో ఏనీటైమ్ మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎక్సైజ్ అధికారులను గాడిలో పెట్టడంతోపాటు, మద్యం వ్యాపారుల విచ్చలవిడి తనానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పైసల్లేకుండా పరీక్షలెలా?

(5వ పేజీ తరువాయి)

సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి రూ.10 లక్షలు ఇంకా రావాల్సి ఉంది. ఈమొత్తం విడుదల కాకపోవడంతో మళ్లీ అప్పులు చేసి పరీక్షలు నిర్వహించాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు అసలు బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వాహనాలకు కనీసం రూ.20 లక్షలు ఖర్చు చేయాలి. రెండుసార్లు ప్రశ్నపత్రాలను నిర్దేశించిన పాయింట్లకు చేరవేసేందుకు, భద్రత కోసం రూట్ ఆఫీసర్లకు కార్లను వినియోగించాలి. స్క్వాడ్ అధికారులు, సెంటర్ కస్టోడియన్లకు వాహనాల బాడుగతోపాటు ఆయిల్, ఇతర ఖర్చులకు ఈ మొత్తం వ్యయం అవుతుంది. అయితే పైసా కూడా ప్రభుత్వం విడుదల చేయకుండా పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం చేయించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది.

ఉత్సాహంగా..

(5వ పేజీ తరువాయి)

హాజరయ్యారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎస్ విజయ్‌కుమార్ నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించగా చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య పాల్గొన్నారు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరి పట్టణంలో చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొని దోర్నాల బస్టాండు సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. పలు పట్టణాలు, మండల కేంద్రాలతోపాటు గ్రామ, గ్రామానా కార్యక్రమాలను నిర్వహించారు.



డాక్టర్ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

డాక్టర్ వెంకటేశ్వరరావుకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ బోధన వైద్యశాల(రిమ్స్)లో మొదటిసారిగా గుండెకు స్టంట్ వేసి ఆపరేషన్‌ను విజయవంతం చేసిన ప్రముఖ గుండె వైద్య నిపుణుడు కె.వెంకటేశ్వరరావును ప్రజాసంఘాల నాయకులు సత్కరించారు. స్థానిక రిమ్స్‌లో శనివారం డాక్టర్ వెంకటేశ్వరరావుకు శాలువ కప్పి బొకే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల కోసం పనిచేసే వైద్యులను వైద్యో నారాయణో హరిగా ప్రజలకు కీర్తిస్తారన్నారు. రిమ్స్‌లో గుండెవైద్య నిపుణులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దన్నారపు మస్తాన్‌రావు, మద్దులూరి శ్రీనివాసులు, జి.వీరభద్రాచారి, తస్నీరు సురేష్, కడవకుదురు అంజిబాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

ఒంగోలు క్రైం, మే17(ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన ఒంగోలు మండలం మండవారిపాలెంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండవారిపాలెం గ్రామానికి చెందిన మండవ రామకృష్ణతో అపర్ణకు మూడేళ్ళ క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి అపర్ణను భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తుంటాడని తండ్రి వినోద్‌కుమార్ తెలిపాడు. తన అల్లుడు రామకృష్ణ మానసిక పరిస్థితి సరిగా లేదని, అదే సమయంలో ఆయన పెదనాన్న రామోహనరావు మరి కొంతమంది కుటుంబ సభ్యులు కలిసి ఇంట్లో నుంచి అపర్ణను బయటకు పంపించాలని అనేక మార్లు దాడులు చేశారని తెలిపారు. గతంలో ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని చెప్పారు. అయినప్పటికీ శనివారం భర్త రామకృష్ణ, అత్త రాధిక, రామోహన్‌రావుతోపాటు 15 మంది వచ్చి ఇంట్లో ఉన్న తన కుమార్తె అపర్ణను ఇంటి నుంచి వెళ్లగొట్టేందుకు దాడి చేశారని, దీంతో మనస్థాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తండ్రి వాపోయాడు. చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ ఔట్ పోస్టు పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని తాలుకా పోలీస్‌స్టేషన్‌కు పంపిచారు. కాగా ఆసుపత్రిలో ఉన్న అపర్ణను మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ళ అరుణ, కోశాధికారి బీరంగుంట అరుణ పరామర్శించారు.

కారుణ్య నియామకం కింద ఆరుగురికి ఉద్యోగాలు

ఒంగోలు క్రైం, మే17(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల కింద ఆరుగురు మహిళలకు పోలీసులుగా నియమిస్తూ ఉద్యోగ పత్రాలను ఎస్పీ ఏఆర్.దామోదర్ శనివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఆర్టీసీలో పని చేస్తూ మరణించడంతో వారి కుటుంబసభ్యులు బురగ కావ్య, ఉప్పలపాటి అనురాధ, పూసపాటి అమృత, నామ పద్మావతి, కరేడు స్రవంతి, గుంటూరు రమణలకు ఎస్పీ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్, సిబ్బంది యు.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటో బోల్తా- వ్యక్తికి గాయాలు

చినగంజాం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి బోల్తా కొట్టడంతో వ్యక్తికి గాయా లైన ఘటన శనివారం చోటుచేసుకొంది ఈ ఘట న చినగంజాం, ఉప్పుగుం డూరు గ్రామాల మధ్య ఉన్న సాయిబాబా మంది రం సమీపంలో చోటు చేసుకుంది. హైవే అంబు లెన్స్ వారు తెలిసిన వివరాలు ప్రకారం ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఎదురు చెన్నారెడ్డి తన కారులో చీరాల నుండి ఒంగోలు వెళ్తున్నాడు. ఆయన మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడు. సాయిబాబా ఆలయ సమీపంలోనికి వచ్చేసరికి మద్యంమత్తులో ఉన్న చెన్నారెడ్డి కారును రోడ్డు పక్కకు నడుపుతుండగా అదుపు తప్పి 216వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న పంట కాలువలోనికి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో చెన్నారెడ్డికి రక్త గాయాలయ్యాయి. ఆయన్ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



గాయపడ్డ చెన్నారెడ్డి

సీసీఆర్ కార్డుదారులకే ప్రభుత్వ పథకాలు

పంగులూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు దక్కాలంటే సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని పంగులూరు, చందలూరు గ్రామాలలో శనివారం కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిం చారు. పంటరుణంతో పాటు అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు ఇతర ప్రయోజనాలకు కౌలుదారు కార్డు తప్పనిసరి అన్నారు.

గృహహింస కేసు

మార్టూరు, మే17(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం తన భర్త ఆయన కుటుంబ సభ్యులు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని మార్టూరు గ్రామంలోని ముస్లింకాలనీలో నివాసం ఉంటున్న మునిపల్లి రిజ్వానా అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు భర్త అత్తమామలు ఆడపడచులపై శుక్రవారం రాత్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా శనివారం తెలిపారు.

దయనీయ స్థితిలో బర్లీ పొగాకు రైతులు

- కొనేవారి కోసం ఎదురు చూపులు
- ముఖంచాటేస్తున్న వ్యాపారులు
- నైరాశ్యంలో సాగుదారులు



మండెలు వేసిన పొగాకు రైతులు

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. చేతికి వచ్చిన పంటను అమ్ముకోలేక వారు నానా అవస్థలు పడుతున్నారు. కొనేవారి కోసం ఎదురు చూపులు చూస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. మరో వైపు అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చమని ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఉన్న పొగాకును తులానికో ఫలానికో అమ్ముకొని అప్పులు తీర్చుకుందా మన్నా, వ్యాపారులు ముఖం చాటేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి రాష్ట్రస్థాయిలో ఉన్నత అధికారులతోపాటు, కంపెనీ ప్రతినిధులతో రివ్యూలు నిర్వహించినా ఫలితం లేకపోవడం బర్లీ రైతులను మరింత కలవరానికి గురిచేస్తోంది. నిన్న మొన్నటి వరకు అరకొర ధరకు అడిగిన వ్యాపారులు ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో అన్నదాతలు కన్నీరు పర్యంతరం అవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పొగాకు రైతుల పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా బర్లీ పొగాకు మండెలే దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఈఏడాది సాగుదారుల్లో అత్యధికం కౌలు రైతులే ఉండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే లక్షలు ఖర్చు చేసి అప్పులు చేసి మరీ సాగు చేసుకున్నామని పంట చేతికి అంది వచ్చి నెలలు గడుస్తున్నా కొనేనాధుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు, వ్యవసాయ ఖర్చులు కలుపుకొని ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చుఅయ్యిందని రైతులు వాపోతున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోనే అత్యధికంగా బర్లీ పొగాకును రైతులు సాగుచేసుకున్నారు. వ్యాపా రులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేయాలన్న ఆలోచనతో మొఖం చాటువేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉంటే ఎండకు వానకు పొగాకు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ధర ఆశాజ కంగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు పొగాకు సాగుచేశారు. ఇదే సమయంలో పొగాకు కంపెనీలు సైతం తమ ప్రతినిధులను రైతుల వద్దకు పంపించి కొనుగోలు హామీ ఇప్పించాయి. నాణ్యమైన పొగాకును తామే కొను గోలు చేస్తామని రైతులకు హామీ ఇప్పించాయి. ప్రస్తుతం సదరు కంపెనీలు ముఖం చాటేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసే విధంగా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

పర్చూరులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలింపు



మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన స్థానికులు

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు గుర్తుతెలియని మృతదేహం వెలుగుచూడడం సంచలనంగా మారింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పంచాయితీ రాజ్ భవనం ప్రహరీ గోడ వెంబడి ఇటీవల వర్షానికి చేరిన నీటిలో శనివారం మృతదేహం పడి ఉంది. గుర్తించిన వాహనదారులు ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై మాల్యాద్రి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం పడిఉన్న తీరు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనం తరం నీటిలో నుండి మృతదేహాన్ని వెలికి తీయించి రెవెన్యూ సిబ్బంది సారధ్యంలో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న యువకుని మృతదేహం ఇలా అనుమా నాస్పదంగా పడిఉండటం చర్చనీయాంశంగా మారింది. మృతదేహం శరీరంపై కేవలం షాట్ మాత్రమే ధరించి ఉన్నారు. గుర్తు తెలియని మృతదేహం వెలుగు చూడడంతో పెద్ద ఎత్తున ప్రజలు ప్రాంగణా నికి తరలి వచ్చారు. మృత దేహం ఎవరిది, ప్రమాదవ శాత్తు మృతి చెందాడా, మరి ఏఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. అయితే గుర్తు తెలియని వ్యక్తి కావటంతో మృతదేహాన్ని స్థానిక మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలపట్ల అసభ్య ప్రవర్తన

- నిలదీసిన వ్యక్తిపై పలువురి దాడి
- ఘటనపై ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల పట్ల అసభ్య ప్రవరించడంతో పాటు అడ్డుకున్న భర్తపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన ఓ కుటుంబం రెండు రోజుల క్రితం రామాపురంలోని సముద్రతీరానికి వెళ్లింది. ఈ క్రమంలో స్నానాలు చేస్తుండగా అటుగా వెళ్తున్న ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆ కుటుంబంలోని మహిళల పట్ల అసభ్యక రంగా ప్రవర్తించాడు. దీంతో నిలదీసిన భర్తపై కూడా దాడిచేశారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడిమృతి

మార్టూరు,మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన తాతా తిరుపతిరాయుడు (34) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం వేకువజామున మృతిచెందారు. ఆ శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో గడ్డిమందు తాగడంతో ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

జిల్లాలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ వారం బీట్ దహీట్ అనే ప్రోగ్రామ్‌ను చేపట్టింది. అందులో భాగంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు వేసవి ఉపశమనం కోసం చలివేంద్రాల ఏర్పాటు, భవిష్యత్‌లో గ్రీనరీ కోసం మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఒంగోలు నగరంలోని ప్రకాశం భవన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అలాగే జరుగుమల్లి మంత్రి స్వామి పాల్గొని చలివేంద్రంతో పాటు మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా వివిధప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతా చర్యలు కూడా చేపట్టారు.



ఈదుమూడి గ్రామంలో రోడ్లు శుభ్రం చేస్తున్న చీరాల ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తదితర టీడీపీ శ్రేణులు, అధికారులు



స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ ర్యాలీ నిర్వహిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అధికారులు



ప్రకాశం భవన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా



పెదదోర్నాలలో మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



కనిగిరి ప్రభుత్వ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, తదితరులు



పెద్దారవీడులో ఉపాధి పనుల వద్ద మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో జాన్ సుందరం

ఉపాధి పనుల పరిశీలన

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

పెద్దారవీడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడులోని మహ్మద్‌సాహెబ్ కుంటలో చేస్తున్న ఉపాధి పనులను ఎంపీడీవో జాన్‌సుందరం శనివారం పరిశీలించారు. మండలంలో పనిచేసినా ఫలితం రాదేయే! శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో శనివారం పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. అక్కడ వారికి తాగునీటి వసతి ఏర్పాటు చేయకపోవడం, వైద్య సదుపాయాల లేమి తదితర అంశాలపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను మందలించారు. వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బంది నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకువచ్చి కూలీలకు అందజేయాలని సూచించారు. మొత్తం 400 మంది కూలీలకు డిమాండ్ పెట్టగా కేవలం 250 మంది మాత్రమే ఉండడాన్ని గుర్తించారు. కూలీలు చేసిన పనికి మాత్రమే వేతనం చెల్లించాలని ఆదేశించారు. పని చేసిన కూలీలకు తప్పక వేతనం వచ్చే విధంగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

ఒంగోలు విద్య, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 19నుంచి ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో జరుగుతుందని ఇంటర్‌బోర్డు ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. 19న సంస్కృతం, ఇంగ్లీషు, తెలుగు, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టులు, ఒకేషనల్‌లో ఎల్ఎంవో, ఏఅండ్‌టీ, ఓఎ, సీఎస్ఈ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. 21న ఫిజిక్స్ఎకనామిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, బోటని, జువాలజీ, కామర్స్ సబ్జెక్టులు, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సులు గణితం,ఫిజికల్‌సైన్స్, బైలాజికల్‌సైన్స్‌సబ్జెక్టులకు మూ ల్యాంకనం జరుగుతుందని తెలిపారు. మూల్యాంకనం విధులకు నియమితులైన వారు వెబ్‌సైట్ నుంచి నియామకపు ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకొని హాజరుకావాలన్నారు మూల్యాంకన విధులకు హాజరుకానివారిపై బోర్డునిబంధనల మేరకు చర్యలు ఉంటాని ఆయన హెచ్చరించారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

గ్రామ,వార్డు సచివాలయాల్లో క్యూ ఆర్ కోడ్
అవగాహన కల్పించేందుకు శ్రీకారం



ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వద్దకే పరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ద్వారా అందించే అన్ని రకాల సేవలను తమ సెల్‌ఫోన్ వాట్సాప్‌ద్వారానే అందుకొనే విధంగా శ్రీకారం చుట్టారు. ప్రజలు కూడా ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా వినియోగించుకొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన సేవలను తెలుగులోనే ఉండటంతో కొద్దిగా అవగాహన ఉంటే వారికి ఏ సమాచారం కావాలన్నా నిమిషంలోనే అందుకొనే సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. కేవలం క్యూఆర్ కోడ్‌ను తమ సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే ప్రభుత్వ సేవలు అందుకోవడం సులభతరం చేసింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఫోన్ నెంబరును అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం తాజాగా క్యూఆర్ కోడ్‌ను కూడా రూపొందించింది. ఇప్పుడు ఆ క్యూర్ కోడ్‌ను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్ ద్వారా తొలిదశలో 161 సేవలను అందుబాటులోకి రాగా రానున్న రోజుల్లో మరో 360 రకాల సేవలను అందుబాటులోకి తేనుంది. తాజాగా ప్రభుత్వం రైస్ కార్డుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత తాము చేసుకున్న అర్జీ పరిస్థితి ఎలా ఉందనేది కూడా తెలుసుకొనే అవకాశం ఉంది. ఇంకొక వైపు తమకు అందే ప్రభుత్వ సబ్సిడీలు కూడా తెలుసుకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే బాక్సు వస్తోంది. ఆ బాక్సులో వారికి అవసరమైన సమాచారం తెలుగులోనే ఉంటుంది. ఆ బాక్సులో రైస్ కార్డు, ఆధార్ కార్డు, ఏదైనా ఇంకా సమాచారానికి సంబంధించిన నెంబర్లను కొడితే అందుకు సంబంధించిన సమాచారం కూడా అందుబాటులోకి వస్తోంది.





తొట్టెల్లో నీరే దిక్కు

పెద్దదోర్నాల మండలం హసనాబాద్ గ్రామంలో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. బోర్లు ఒట్టిపోయాయి. దీంతో ప్రజలు వాడుకునేందుకు పొలాల్లో పశువుల కోసం ఏర్పాటు చేసిన తొట్టెల్లో నింపిన నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి ట్యాంకర్లతో సరఫరా చేయాలని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అధికారులను కోరుతున్నారు.

- పెద్ద దోర్నాల

రక్తపోటుపై ప్రజలకు అవగాహన

వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి) : రక్తపోటు(బీపీ) బారిన పడుతున్నవారి సంఖ్య రోజుకు రోజుకు పెరిగిపోతోందని, అందువల్ల రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సం దర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనేక మంది బీపీ ఉందన్న విషయం తెలుసుకొనే లోపే అనేక అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయన్నారు. 120/80 ఉంటే సాధారణ బీపీగా లెక్కించడం జరుగుతుందన్నారు. ఇటీవల చిన్న వయస్సులోనే దీని బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ గృహాలు సందర్శించి 18 ఏళ్లు పైబడిన వారందరికి రక్తపోటు ఉన్న వారికి ప్రాథమిక చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో 104 వాహనం ద్వారా కూడా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. బీపీపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధిక రక్తపోటు ఉన్న వారు సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన గుండె జబ్బుల వైద్య విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగిరథి, అకౌంటెండెంట్ రాజేష్, మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సీపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కంభం, మే 17 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (సీపెట్) విజయవాడలో 10వ తరగతి విద్యార్హతతో 3 సంవత్సరాల డిప్లమో ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమో ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ టెస్టింగ్ (పీడీజీడీపీపీటీ) మూడు కోర్సులకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను మే 29వ తేదీలోపు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, సిపెట్ అడ్మిషన్ టెస్టు జూన్ 8న నిర్వహించి వచ్చిన ర్యాంకుల ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేస్తారని వివరించారు. ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి ప్లాస్టిక్ రంగంలో, దాని అనుబంధ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని, ప్రారంభ వేతనం నెలకు రూ.20వేల నుంచి రూ.25వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9912973391 సంప్రదించాలని శేఖర్ సూచించారు.

పాలిసెట్ ర్యాంకర్‌కు మంత్రి అభినందనలు



ర్యాంకు సాధించిన రూపాదేవిని అభినందిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రకటించిన పాలీసెట్ ఫలితాల్లో మండలంలోని శానంపూడికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధనేకుల బలరాం కుమార్తె రూపాదేవి సత్తా చాటింది. 120కిగాను 117 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 167 ర్యాంకును కైవసం చేసుకుంది. పాలీసెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన రూపాదేవిని శనివారం మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థిని ఉత్తమ ర్యాంకు సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

జరభద్రం..!

ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో ఊడుతున్న శ్లాబు పెచ్చులు

భయపడుతున్న ఉద్యోగులు



కార్యాలయ ప్రాంగణంలో ఎవరూ వెళ్లకుండా తాడు కట్టిన ఉద్యోగులు



శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు, స్తంభాలకు పెట్టిన హెచ్చరిక బోర్డులు(ఇన్‌సెట్లో)

"ఒంగోలు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే ప్రజలు జరభద్రంగా ఉండాలి. లేకుంటే నెత్తిపై శ్లాబ్ పెచ్చులు పడే ప్రమాదం ఉంది." ఈ విషయం ఎవరో చెప్పడం లేదు. ఆ కార్యాలయ ఉద్యోగులే ప్రజలను అప్రమత్తం చేసేందుకు నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. అసలేం జరిగిందంటే.. ఒంగోలులోని ఎంపీడీవో కార్యాలయం భవనం కొంత భాగం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు నుంచి పెచ్చులూడి పెడుతున్నాయి. దీంతో కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో భవనం బయట కారిడార్ శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్న ప్రదేశం చుట్టూ తాడు కట్టి దానికి ఎర్ర రిబ్బన్లు కట్టారు. ప్రజలు పొరపాటున అక్కడకు వెళ్లి ప్రమాదం బారిన పడకుండా హెచ్చరిక బోర్డులు రాసి ఇరుపక్కల ఉన్న సిమెంట్ స్తంభాలకు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై కార్యాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి కారిడార్ శ్లాబ్‌కు వెంటనే మ రమ్మతులు చేయించాలని కోరారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

భక్తిశ్రద్ధలతో జాలమ్మతల్లికి పూజలు

సింగరాయకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని కందుకూరు రోడ్డు సమీపంలోని జాలమ్మతల్లి దేవస్థానం 12 వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని విఘ్నేశ్వరుడు, జాలమ్మతల్లి, వేణుగోపాలస్వామి విగ్రహాలను ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం విఘ్నేశ్వరుడికి 1008 ఉండ్రాళ్లతో సహస్రనామార్చన, జాలమ్మతల్లికి సహస్రనామ తులసిదళ అర్చన, జాలమ్మతల్లిక సహస్రనామ కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్నాహం జీవీఆర్ కంపెనీ వారి సౌజన్యంతో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రాత్రికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



జాలమ్మతల్లికి కరెన్సీతో అలంకరణ

ఉపాధి కూలీల కనీస వేతనం పెంచాలి

సంతనూతలపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల కనీస వేతనం పెంచాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. చంద్రపాలెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల వద్దకు శనివారం వ్యవసాయకార్మిక సంఘం నేతలు వెళ్లి విచారించగా తమ కనీస గిట్టుబాటు కూలీ ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం కనీసం వేతనం రూ.307కు పెంచిందని, పనిచేసే కూలీలకు అందించేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోలను క్రమబద్ధీకరణ చేయాలి



దీక్ష చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ళు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను క్రమబద్ధీకరణ చేయాలని పలువురు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారానికి 19వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కానీ, ఉన్నతాధికారులు గాని పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని కోరారు. శ్రమకు తగిన వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 23శాతం ఇంక్రిమెంట్‌ను వెంటనే కల్పించాలని, అద్దె బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్, షేక్ ఆదిల్, గంటా ప్రసన్న, జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కా మేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ● అల్లూరులో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'కు హాజరు ● పలు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. అత్యవసరమైతే తప్ప ఎండ సమయంలో బయటకు రావద్దని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంక్షన్‌లో ద్విచక్రవాహనాలు ఆగినప్పుడు ఎండ వేడిమికి గురికాకుండా షేడ్‌నెట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో డీఆర్వో రక్తపోటు, మధుమేహ వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్లూరులో..

కొత్తపట్నం: అల్లూరు గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా పర్యటించారు. తొలుత గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు. అలాగే వైద్యశిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను చేపట్టిందన్నారు. విరివిగా మొక్కను నాటాలని కోరారు. రూఫ్‌టాప్ గార్డెన్లను ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అల్లూరు గ్రామాన్ని విజువల్ క్లీనింగ్ తీర్చిదిద్దేలా గ్రామస్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజిరెడ్డి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జడ్పీసీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఎంపీటీసీ శాంతారావు పాల్గొన్నారు.



అల్లూరులో చెత్తసంపద కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

తాలుకా పోలీస్‌స్టేషన్‌లో..

ఒంగోలు క్రైం: స్థానిక తాలుకా పోలీస్‌స్టేషన్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఇన్‌చార్జి సీఐ శ్రీకాంత్‌బాబు సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రం చేశారు. మొక్కలు నాటారు.

ఏడుగుండ్లపాడులో..

మద్దిపాడు: ఏడుగుండ్లపాడు గ్రామంలో డీఆర్వో చినఓబులేసు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణరావు, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ నారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, సర్పంచ్ శిల్పసౌందర్య పాల్గొన్నారు.

భూతాపాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాలి

● ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, కొండయ్యయాదవ్
● ఈదుమూడిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర
● ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు విజయ్ కుమార్, కొండయ్య యాదవ్

నాగులుప్పలపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): భూతాపాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఈదుమూడిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యయాదవ్, డీసీసీబీ చైర్మన్ సీతారామయ్య, మాజీ మంత్రి బాచిన చెంచు గరటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో ఆక్సిజన్ సక్రమంగా అందని పరిస్థితి నెలకొందని, ఉష్ణతాపం నివారించేందుకు మొక్కలు నాటాలని కోరారు. ప్రతి ఇంట్లో రూఫ్‌టాప్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కొండయ్యయాదవ్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఈదుమూడిలోని బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని చీరాల ఎమ్మెల్యే కొండయ్య యాదవ్, డీసీసీబీ చైర్మన్ సీతారామయ్య, మాజీ మంత్రి చెంచుగరటయ్యలతో కలిసి ఎమ్మెల్యే బీఎస్ ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీపీహెచ్‌వో బేబీరాణి, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడకా స్వాములు, మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, తెలగతోటి జాన్సన్, నాయకులు గుమ్మడి సాయిబాబా, కనగాల శ్రీను, బి.సెల్వం, గూడూరి ఝాన్సీ, హరినాథ్, జనసేన నాయకులు సాయి పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవాలి

● ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, మే17(ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ పార్కులో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ ఇంటి అవసరాల కోసం సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గృహ వినియోగదారులకు మాత్రమే ఈ అవకాశం ఉందని చెప్పారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం కేంద్రం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.30వేలు, 2 కిలోవాట్‌లు అయితే రూ.60వేలు, మూడు కిలోవాట్‌లకు అయితే రూ.78వేల వరకు రాయితీ ఇస్తారని ఆయన తెలిపారు. అంతేగాకుండా రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేస్తున్నాయని పేర్కొన్నారు. అందుకోసం గృహ యజమానులు పీఎం సూర్యఘర్.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సోలార్ వల్ల కరెంటును ఆదా చేయడంతో పాటు స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఈఈ మాకినేని హరిబాబు, డీఈ పాండురంగారావు, ఏఈ శివప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు మాలెంపాటి కృష్ణ, మండవ మురళీకృష్ణ, చెన్నుపాటి ప్రసాద్, మేడికొండ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

32మంది 'శ్రీహర్షిణి' విద్యార్థులకు ఉద్యోగాలు

● అభినందించిన కళాశాల చైర్మన్ రవికుమార్

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 32 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. హెట్రో కంపెనీ, సీఈఏటీ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. సీఈఏటీ కంపెనీలో రూ.2.4లక్షల ప్యాకేజీతో 24 మంది ఎంపిక కాగా హెట్రో కంపెనీలో రూ.2.8లక్షల ప్యాకేజీలో 8మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ చేరిన విద్యార్థికి కాంపిటేటివ్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు అవసరమైన స్కిల్స్‌ను ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వందశాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్య క్రమంలో కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు. పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి దిలీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

కొండపి, మే 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బోర్డు నేరుగా రంగంలోకి దిగి గిట్టుబాటు ధరకు పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం రైతు నాయకులతో కలిసి నేతివారిపాలెం గ్రామంలో పర్యటించి, పొగాకు రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో వేలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల్లో రైతులు పెట్టుబడులు అధికంగా పెట్టారని, ప్రస్తుతం బ్యారన్‌కు లక్షల రూపాయల నష్టం వాటిల్లుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో బోర్డు రంగంలోకి దిగి లో గ్రేడ్, మేలిమి పొగాకును కొనుగోలు చేస్తేనే వ్యాపారులు పోటీ పడతారన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

25లోపు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

సంతనూతలపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 17 యూనిట్లకు గాను రూ.24.50 లక్షలు పలు పథకాల కోసం బ్యాంకులకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి

జరుగుమల్లి, మే 17 (కొండపి) (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. శనివారం జరుగుమల్లిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చలివేంద్రం, మెడికల్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ధ్యేయంగా కార్యక్రమాలను గ్రామాల్లో పటిష్ఠంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా చెత్తను తరలించడానికి ఇప్పటికే కొన్ని పంచాయతీలకు ట్రాక్టర్లను అందజేశామని తెలిపారు. గ్రామాల్లో చెత్తను రోడ్ల వెంబడి వేయకుండా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. సైడ్ కాలువల్లో మురుగు నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ సిబ్బంది శుభ్రపరచాలన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

చీమకుర్తి, మే17(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం ఉత్సాహంగా జరిగింది. 2010-14 బీటెక్ సీఎస్ఈ విద్యార్థులు హాజరై ఆప్యాయంగా పలకరించుకున్నారు. కళాశాల చైర్మన్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజరై వారిని అభినందించారు. అనంతరం తమ గురువులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ ఏవీ.ప్రతాప్ కుమార్, ఏవో కోటిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

సంతనూతలపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యాలకు భరోసా ఉంటుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. శనివారం సంతనూతల పాడులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వీధుల్లో, దుఖాణాల వద్ద చెత్తను ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, జడ్పీటీసీ డి.రమణమ్మ, తన్నీరుశ్రీను, ఎం.శ్రీనివాసరావు ఆర్.అంకారావు, బి.శంకర్ పాల్గొన్నారు. మద్దులూరులో సర్పంచ్ శైలజ, టీడీపీ నాయకుడు నువ్వల మీరయ్య, ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.



దుకాణాదారుడితో మాట్లాడుతున్న అధికారులు

పశువుల దాహార్తిని తీర్చేందుకు తొట్టెల నిర్మాణం

ఒంగోలు(రూరల్), మే17 (ఆంధ్రజ్యోతి): పశువులు, పక్షుల దాహార్తిని తీర్చిందుకు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద తాగునీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. ఒంగోలు మండలంలోని కరవది, ఉలిచి గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఎండలో బయట తిరగవద్దన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. అనంతరం పశువుల నీటితొట్టెలను ప్రారంభించారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు పూర్ణచంద్రారావు, కాంచన, కరవది సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఉలిచి సర్పంచ్ మంచు మురళి, నాయకులు చుంచు శేషయ్య, యర్రంనేని నరసింహారావు, చుంచు శింగయ్య, నన్నపనేని వెంకట్రావు, ఏఎన్ఎంలు పి.జయకుమారి, డి.రజినికుమారి, సుబ్బమ్మ, ఎ.కృష్ణవేణి పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభించారు.



ఉలిచిలో నీటితొట్టెను ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

నందిపాడు రేషన్ డీలర్‌పై విచారణ

మద్దిపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): నందిపాడు రేషన్‌డీలర్‌పై అందిన ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి శనివారం విచారణ చేపట్టారు. లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని గ్రామానికి చెందిన మండవ ప్రతాప్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గ్రామంలో విచారించారు. అయితే రేషన్ డీలర్ అనారోగ్య సమస్యలపై చెన్నై ఆస్పత్రికి వెళ్లారని గ్రామస్థులు తెలిపారు. అయితే రేషన్ వాహనదారుడు కె.కోటి సరుకులను పంపిణీ చేయకుండా రేషన్‌కు బదులుగా డబ్బులు తీసుకోండి.. రేషన్ కావాలంటే బసవన్నపాలెం రేషన్‌డీలర్ షాప్‌కు వెళ్లాలని చెప్పారని వారు వివరించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డీటీ తెలిపారు. విచారణలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీకిరణ్ పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



చక్రస్నానంలో పాల్గొన్న అర్చకులు, ఉభయదాతలు

మద్దిపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివారి చక్రస్నానం, చక్రతీర్థం కార్యక్రమాన్ని అర్చకులు నారాయణం రవికుమార్, వెంకటాచార్యులు, దివి వెంకటశేషాచార్యులుఅయ్యంగార్ శాస్త్రీయంగా నిర్వహించారు. ఉభయదాతలుగా నారిపెద్ది వరహాలచౌదరి, రాధ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు, లింగా సంజీవరెడ్డి, చల్లంచర్ల కృష్ణారెడ్డి, ఘడియపూడి సత్యం, ఎం.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే అరెస్టులు : బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కక్షతోనే మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కక్షసాధింపు చర్యల వల్ల అన్ని వ్యవస్థలు దెబ్బతింటున్నాయని, ఈ విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జూపూడి ప్రభాకరరావు, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మన్నం శ్రీధర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఒమ్మెవరంలో వేంచేసిన ఉన్న శ్రీ ప్రసన్నవేంకటేశ్వర స్వామి వార్ల వార్షిక కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణ క్రతువును వేదపండితులు శిష్టా పాండురంగయ్య, శ్రీనివాసరావు జరిపించారు. ఈ సందర్భంగా గోగినేని సుబ్బారావు, పిన్నింటి నాగార్జున, నార్నె అనిల్‌కుమార్ దంపతులు స్వామి వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణం తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నసంతర్పణ, గ్రామోత్సవం నిర్వహించారు.



స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలులో ట్రిపుల్‌ఐటీని కొనసాగించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రావ్‌అండ్ నాయుడు కళాశాలలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీ కళాశాలలను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వినోద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ట్రిపుల్‌ఐటీకి తక్షణమే స్థలం కేటాయించి శాశ్వత భవన నిర్మాణాలను చేపట్టాలన్నారు. అద్దె భారం తగ్గించుకునేందుకు ఒంగోలు విద్యార్థులకు ఇతర ట్రిపుల్‌ఐటీలకు పంపడం సరికాదన్నారు. ఇప్పటికే క్యాంపస్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని సరిపడినంత మందిని నియమించాలని ఆయన కోరారు.



పట్టణంలో కురుస్తున్న వర్షం

గాలులతో వర్షం

మార్కాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ, మండల పరిధిలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోత వాతావరణం ఉంది. ఉష్ణోగ్రత కూడా అత్యధికంగా నమోదైంది. సాయంత్రం 4.00 గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు 5.30 గంటల వరకు వర్షం ఎడతెరపి లేకుండా కురిసింది. దీంతో పట్టణంలోని కొన్ని లోతట్టు ప్రాంతాలు, రహదారులపై వర్షపు నీళ్లు నిలిచాయి. పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల్లో కూడా మోస్తరు వర్షం కురిసింది. కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. మధ్యాహ్నం వరకూ అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

వాగు భూముల్లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమితప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎస్ఐ వేమన

పొదిలి, మే 17 పీడీయల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాసర్లపల్లి, కుంచేపల్లిలో వాగు పోరంబోకు భూములో ఆక్రమణలను శనివారం తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎస్.వేమన ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. మొత్తం 8 మంది రైతుల నుంచి 5 సర్వే నెంబర్లలో 17 ఎకరాల 10 సెంట్ల భూమిలో ఉన్న ఆక్రణలను తొలగించారు. 8 మంది రైతులకు నోటీసులిచ్చి తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. అందరి ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరినట్లు ఆయన చెప్పారు. అందరి దగ్గర ఉన్న ఆక్రణలు తొలగిస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ నరసింహారావు, వీఆర్వో మాల్యాద్రి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండల నుంచి ఉపశమనంతోపాటు ప్రజల దాహార్తి తీర్చేలా గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గూడూరి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని నాయకులు, అధికారులు సమన్వయంతో పట్టణం, పల్లె తేడా లేకుండా స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వరలక్ష్మి, సర్పంచి చిత్తూరి హారిక, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, షేక్ మంజూర్‌బాషా, సుబ్బారెడ్డి, షేక్ ఇస్మాయిల్, బాషా పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాలను చేతబూని జై భారత్ అంటూ ఆపరేషన్ సిందూర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ మాట్లాడుతూ పాకిస్థాన్ విషయంలో ప్రధాని మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికీ ప్రజలందరూ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పాకిస్థాన్ అప్పగించాలని, అలాగే ఉగ్రవాదులను పూర్తిగా అంతం చేయాలని, ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేశాకే చర్చలకు రావాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు కె.నరసింహులు, మహేష్, బాదుల్లా, వివిధ వర్గాల ప్రతినిధులతోపాటు అనూష స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మదార్‌వలి

పొదిలి, మే 17 పీడీయల్ (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్‌లకు సంబంధించి సబ్సిడీ రుణాలను అమలు చేయాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి కోరారు. ఈమేరకు శనివారం మండలపరిషత్ అధికారి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మదార్‌వలి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులకు కొన్ని బ్యాంకుల వారు రుణాలు ఇస్తే ఏవిధంగా తీరుస్తారని ప్రశ్నిస్తున్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన దివ్యాంగులకు రుణా లు ఇచ్చే క్రమంలో బ్యాం కుల నుంచి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని కోరారు. పంచాయతీ, సచివాలయాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగుల చట్టాలను అమలు పరిచే విధంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో టైలర్ సుభాని, క్రిష్ణ, సయ్యద్ ఆరీఫా ఉన్నారు.

పురుగు మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన కుందురు వెంకట నారాయణరెడ్డి(55) పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపిన వివరాల ప్రకారం వెంకట నారాయణరెడ్డి ఈ నెల 15 తేదీ గురువారం కుటుంబ కలహాలతో తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

మాట్లాడనివ్వనప్పుడు సమావేశమెందుకు?



ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు ఇందిర

తర్లుపాడు,మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలిని మాట్లాడనివ్వకపోతే ఈ సమావేశం జరపడమెందుకంటూ ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్‌పై జడ్పీటీసీ సభ్యురాలు మ్నో ఇందిర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి మాట్లాడిన తర్వాత జడ్పీటీసీ సభ్యురాలు ఇందిర సమస్యలపై మాట్లాడేందుకు నిలబడుతున్న సమయంలో ఆమె మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా సమావేశం ముగిసిందని ఎంపీడీవో చెప్పడంపై జడ్పీటీసీ సభ్యురాలు ఇందిర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా తనను అవమానించినందుకు ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు. మండలంలో నీటి సమస్య ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష ధోరణి అనుసరిస్తున్నారని పోతలపాడులో బోర్లు వేసి మోటార్లు బిగించినప్పటికీ బిల్లులు చేయకుండా తాత్సారం చేస్తున్నారని పోతలపాడు సర్పంచి గాయం శ్రీనివాసరెడ్డి, కేతగుడిపి సర్పంచి దూదేకుల పెద్ద మస్తాన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రతాప్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూలక్ష్మి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.కిషోర్, ఎంఈవో బీ.సుజాత, పీఆర్ ఏఈ మహంకాళయ్య, ఏపీవో బులెన్‌రావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మారుద్దాం



తహసీల్దార్ కార్యాలయం వద్ద శ్రమదానం చేస్తున్న తహసీల్దార్



గిద్దలూరులో నీటి తొట్టెని పరిశీలిస్తున్న అధికారులు



పొదిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం నియోజకవర్గాన్ని ప్లాస్టిక్‌రహిత నియోజకవర్గంగా మారుద్దామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా మన్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పక్షులకు దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లతో నీటిని నింపారు. దాణా అందించారు. గాంధీ పార్కులో మొక్కలు నాటారు. పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక గాంధీ పార్కు నుంచి దోర్నాల బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ప్రయాణికుల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదన్నారు. మన ఊరి పరిశుభ్రత మన చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరెడ్డి, మున్సిపల్ ఏఈ భూపాల్‌రెడ్డి, మెప్మా సిబ్బంది, టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, వెంకటరెడ్డి, ఖాశిం పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఉంటుందని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో తహసీల్దార్ చిరంజీవి సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలలో చెత్త చెదారాన్ని వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు పశువుల వ్యర్థాలను ఇంటి పరిసరాలలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాలలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చింతగుంట్ల గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు స్వచ్ఛ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

గిద్దలూరు : మండలంలోని కెఎస్‌పల్లి పంచాయతీలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఏపీఈడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ అనంతరం సచివాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెను పరిశీలించారు. మొక్కలు నాటారు. చెత్త సేకరణ కోసం రిక్షాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి రోజూ చెత్త సేకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారా వు, స్వచ్ఛ భారత్ ప్రతినిధి బాబూరావు, ఏపీవో రమణి, సచివాలయ కార్యదర్శులు రాఘవరావు, భాస్కర్, సర్పంచ్ ఎలిజబెత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొదిలి : ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి అన్నారు. శనివారం నగరపంచాయతీ కార్యాలయం నుంచి పెద్దబస్టాండ్ వరకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున చలివేంద్రాలు, హెల్త్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు. దాతలు ఎవరైనా ఉంటే ప్రజల కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. పెద్దబస్టాండ్ సెంటర్లో చలివేంద్రం, హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేసి మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో విజయలక్ష్మి స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబు, సీనియర్ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : ఎంపీడీవో జాన్‌సుందరం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, ఉద్యోగులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుధ్యాన్ని పాటించాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీ రామనారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎం కృపావతి, ఆశాలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వైపాలెం గ్రామపంచాయతీ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్, టీడీపీ నేతలు

ఎర్రగొండపాలెం, మే 17 : ఎర్రగొండపాలెం మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్ శనివారం సర్పంచి ఆర్.అరుణాబాయ్‌తో కలసి ప్రారంభించారు. వేసవి ఎండలు ఉష్ణోగ్రతలు పెరిగినందున పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు, మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఉపయోగపడుతుందని ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం గ్రామ పంచాయతీ ఆవరణలో, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంచినీటి చలివేంద్రాలను శనివారం ఎంపీడీవో రాజ్‌కుమార్ ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చుకోవడానికి ఉచిత మంచి నీటి చలివేంద్రాలు ప్రజలకు దోహదపడతాయని ఎంపీడీవో అన్నారు. ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొదిలిలో తాత్కాలిక బస్ షెల్టర్ ఏర్పాటు



పెద్ద బస్టాండ్ సెంటర్లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్

పొదిలి, మే 17 పీడీయల్ (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు నిలువనీడలేక పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి పెద్దబస్టాండ్ సెంటర్లో తాత్కాలికంగా బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. పొదిలి నుంచి చీమకుర్తి, దర్శి, ఒంగోలు, విజయవాడ, అద్దంకి, వినుకొండ వెళ్లే ప్రయాణికులు ఇక్కడ ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ ప్రాంతంలో చిరువ్యాపారులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో అక్కడ నిలబడేందుకు వీలులేకుండా పోయింది. దీనిని గమనించిన కమిషనర్ రెడ్డి ప్రజలు, ప్రయాణికులు వేచి ఉండేందుకు తాత్కాలికంగా బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ షెల్టర్ వద్ద ప్రయాణికులు, ప్రజల దాహార్తి తీర్చేలా 24 గంటలు కూలింగ్ వాటర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కేఎల్ఎన్‌రెడ్డి, భాస్కర్‌కు ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



వేణుగోపాలస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా వేణుగోపాలుని గ్రామోత్సవం

ఎర్రగొండపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలో గత వారం రోజులుగా జరుగుచున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజవాహనంపై స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోతకాపులు పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామిని ప్రజలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

మార్కాపురం వన్‌టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమౌతుందని హ్యాండ్స్ ఆఫ్ కాంపషన్ ప్రివెన్షన్ ప్రాజెక్టు డైరెక్టర్ బెంజిమెన్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో హ్యాండ్స్ ఆఫ్ కాంపషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై శనివారం కళాజాత బృందం వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, కళాజాతా బృందం వారు పాల్గొన్నారు.

అర్చకుడికి వీడ్కోలు సన్మానం



అర్చకున్ని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకునిగా పనిచేస్తున్న ఏవీకే నరసింహాచార్యులకు శనివారం దేవస్థానంలో వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు చక్కా మాలకొండ నరసింహారావు మాట్లాడుతూ నరసింహాచార్యులు ఆలయంలో 12 సంవత్సరాలుగా అర్చకునిగా పనిచేశారన్నారు. ఆలయంలో ఆయన చేసిన సేవలు మరువలేవన్నారు. అమెరికాలో వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకత్వం నిర్వహించడానికి వెళ్తున్న నరసింహాచార్యులు అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నరసింహాచార్యులు దంపతులకు సన్మానం చేశారు.

మంచికి మారుపేరు రమేష్‌బాబు



రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం వన్‌టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : 19వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు దారివేముల రమేష్‌బాబు మంచికి మారుపేరు అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. ఏబీఎం కాపౌండ్‌లో శనివారం రమేష్‌బాబు ఆదరణస్తుతి కూడిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వక్కలగడ్డ మల్లికార్జున్, కౌన్సిలర్లు నాలి కొండయ్య, దారివేముల హర్షితబాబీ, కశ్శెట్టి నగేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

ఒంగోలు ఎంవీఐ భానుప్రసాద్

పొదిలి, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరమని ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఒంగోలు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి భానుప్రకాష్ అన్నారు. శనివారం పట్టణంలో ఒంగోలు ఎంవీఐ, పొదిలి ఆర్టీసీవారు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. పొదిలి - అద్దంకి రూట్లలో అక్రమంగా పత్రాలు లేని పలు ఆటోలు, టాటామ్యాజిక్ వంటి వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన ఫిట్‌నెస్ వంటివి పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్లకు పెనాల్టీ, ఫిట్‌నెస్ లేని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేని వాహనాల్లో ప్రయాణం చేసి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. ప్రయాణికులు సుఖమయంగా ఉండేలా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆర్టీసీ డీఎం శంకరరావు సిబ్బంది ఉన్నారు.

వేసవి శిక్షణ ఎంతో ఉపయోగం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థి

మార్కాపురం వన్‌టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులతో ఎంతో ఉపయోగకరమని గ్రంథపాలకులు శివారెడ్డి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం చేయించి చదరంగంలో శిక్షణ ఇచ్చారు. స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమంలో మెళకువలను నేర్పించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేశారు.

గిద్దలూరు : ఖాళీ సమయాలలో గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. శాఖ గ్రంథాలయం ఆవరణలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం పిల్లలకు వివిధ ఆటల పోటీలలో నైపుణ్యాం పెంపునకు శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాలలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, పాతాళ నాగేశ్వరస్వామి మాజీ ఛైర్మన్ శివపురం ఆంజనేయులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవాలి

విద్యుత్ బిల్లుల నుంచి ఉపశమనం : ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, మే17(ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ పార్కులో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్ఈ మాట్లాడుతూ ఇంటి అవసరాల కోసం సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం కేం ద్రం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.30వేలు, 2 కిలోవాట్‌లు అయితే రూ.60వేలు, మూడు కిలోవాట్‌లకు అయితే రూ.78వేల వరకు రాయితీ ఇస్తారని ఆయన తెలిపారు.

నేటి నుంచి గంగాభవాని తిరునాళ్ల

పామూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడు జలాశయం వద్ద వెలసిఉన్న శ్రీగంగా భవాని అమ్మవారి తిరునాళ్ల ఆదివారం నుంచి గురువారం వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు!

దొనకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేకాధికారిణి పి.బాలమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణకేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన వాతావరణంలో తీవ్ర కాలుష్యం ఏర్పడు తుందన్నారు. మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీదేవి, ఈవోఆర్డీ ఆదాం షఫీ, గ్రామ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

దొనకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజల వేసవి తాపం తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్దగల కూడలిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఎంపీడీవో శ్రీదేవి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండలకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. అవసరమైతే తప్ప ఎండలకు బయటకు రావద్దన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్రప్రదేశ్ గురించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆదాం షఫీ, గ్రామ కార్యదర్శులు కృష్ణమూర్తి, మన్నెం శ్రీనివాసులు, ఏఈ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి

దొనకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వచ్చే నెలలో ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ పథకం ఫార్మర్ ఐడీ ఉంటేనే వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రతిరైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ చేయించుకోవాలన్నారు. మండలంలోని రుద్రసముద్రం గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న ఫార్మర్ ఐడీ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు నాసర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో ఉపాధి పనులు చేయిస్తే చర్యలు

సీఎస్‌పురం(పామూరు), మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి పనులలో బడిఈడు పిల్లలచేత పనులు చేయిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీవో శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని కేఅగ్రహారంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో శ్రీనివాసనాయక్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన రూ.307 కూలీ పొందేందుకు కనీసం నాలుగు గంటలు పనిచేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం ఆరు నుంచి పది గంటలలోపు పనులు పూర్తి చేసుకోవాలన్నారు.

టీడీపీ ఇనిమెర్ల అధ్యక్షుడిగా 'నల్లబోతుల' ఎన్నిక

పామూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండంలోని ఇనిమెర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా నల్లబోతుల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం గ్రామ టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పువ్వాడి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, ఏ.ప్రభాకర్, అమీర్‌బాబు, వై.ప్రసాద్‌రెడ్డి, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చర్చి సెంటరులో జరిగిన మానవహారంలో ఆయన మాట్లాడారు. వాయుకాలుష్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, వాటి వాడకం నియంత్రించాలని కోరారు. భూమి పొరలను ప్లాస్టిక్ దెబ్బతీస్తూ వృక్షాల పెరుగుదలకు విఘాతం కల్పిస్తుం దన్నారు. భూమి నుంచి సెగలు పెరిగి నానాటికి ఉష్ణోగ్రత శాతం పెరిగిపోయి ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వేసవిలో ఎండలు విపరీతంగా ఉన్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు ఆరోగ్యహితమైన పండ్ల రసాలు, మజ్జిగ, నిమ్మరసాలు వంటివి సేవించాలన్నారు. వడదెబ్బ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈసందర్భంగా పామూరు బస్టాండు షెల్టర్‌లో పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. మానవతా సంస్థను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ప్రజాహితం కోసం సేవ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ విధిగా విరివిగా మొక్కల నాటాలని ఎమ్మెల్యే కోరారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీవో శివరామిరెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ చైర్మన్ గఫార్, మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికుల వీరోచిత పోరాటం మరువలేనిది

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు



దర్శి, మే 17(ఆంధ్రజ్యోతి): భారత సైనికుల వీరోచిత పోరాటం మరువలేనిదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. పాకిస్తాన్‌పై భారత సైనికులు నిర్వహించిన సిందూర ఆపరేషన్ విజయవంతమైన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా దర్శిలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. యువకులు దేశభక్తిని చాటుతూ వంద అడుగుల పొడవుగల జాతీయ జెండాను ర్యాలీలో ప్రదర్శించారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ శత్రుదేశాల ఎత్తులను చిత్తు చేయడంలో భారతదేశం ఘన విజయం సాధించిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో శత్రుదేశం ఘోర ఓటమి చవిచూసిందన్నారు. మన సైనికులు చూపుతున్న సాహసానికి అందరం మద్దతు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో, కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వాలు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. దేశరక్షణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రజలందరూ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, పుల్లలచెరువు చిన్నా, నారపుశెట్టి మధు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

దర్శి, మే 17(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందుఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహిళల తరుపున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. రైతన్నల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యమైన జీవితం



ముండ్లమూరు: శంకరాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రత్యేకాధికారి వెంకట రమణ, ఎంపీడీవో సునీత

ముండ్లమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని శంకరాపురంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవటం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పారిశుధ్యం లోపించటం వల్ల వ్యాధులు కూడా వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. పెద ఉల్లగల్లులో కూడా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శంకరాపురంలో డంపింగ్ యార్డును ఎంపీడీవో సునీత పరిశీలించారు. వ్యర్థ పదార్థాలన్నీ డంపింగ్ యార్డులో వేసేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కూరపాటి మహేశ్వరి, జనమాల నాగేంద్రం పిచ్చయ్య, డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు రాజరాజేశ్వరి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో మండలంలోని మారెళ్ల, పీసీపల్లిలో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. మారెళ్ల గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. మండల ప్రత్యేకాధికారి పానకాలరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈ పవన్, ఏపీఎం సత్యానందం, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా శనివారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. చలివేంద్రాలు, వైద్యశిబిరాలను ప్రారంభించారు. ఈసందర్భంగా పువ్వాడి మాట్లాడుతూ ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ కార్యక్రమాల్లో ప్రజలు బాగసామ్యమ్యం కావాలని సూచించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, షేక్ గౌస్‌బాషా, కేవీ రమణయ్య, దరిశి ఏడుకొండలు, ప్రత్యేకాధికారి బి.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్యయాదవ్, మారిటోరియం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి శుక్రవారం రాత్రి గంగాభవానిని దర్శించుకున్నారు. అనంతరం టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభల వేదికలపై నుంచి డాక్టర్ ఉగ్ర మాట్లాడారు. వెనుకబడిన కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ పరిశ్రమలను కేటాయించారన్నారు. అందులోభాగంగా దివాకరపల్లిలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ చేసినట్టు చెప్పారు. పెదయిర్లపాడు రెవెన్యూలోని లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్‌కు కూడా శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. పరిశ్రమలు ఏర్పాటవుతుండటంతో నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భూములకు విలువ పెరిగి మంచి ధరలు కూడా వస్తాయన్నారు. ఇకనుంచి ఉపాధి కోసం వలసలు పోకుండా సొంతగ్రామాల్లోనే పనులు చేసుకోవచ్చునని చెప్పారు. వచ్చే ఏడాది తిరునాళ్ల నాటికి గంగమ్మ గుడిని అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మారిటోరియం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా ఉండటం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీను, సానికొమ్ము విజయ్‌భాస్కర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, పువ్వాడి నాగరాజు, గుదే నాగేశ్వరరావు, బండారు వెంకట్రావు, బండారు శ్రీనివాస్, బండారు వెంకటేష్, పరిమి ఈశ్వరరావు, వడ్డెంపూడి మాధవరావు, నాగోతు శ్రీనివాసులు, వడ్డెంపూడి వెంకట్, ఫిరోజ్, రాజా, సతీష్, సుబ్బారావు, ములకా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

కనిగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): చూపులేకుండా అంధత్వంతో ఎవరూ బాధపడకూడదనే తాను నిరంతరం ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా ఉచితనేత్ర వైద్య శిబిరానికి వందల మంది వృద్ధులు తరలివచ్చారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వృద్ధుల ఆరోగ్య క్షేమ సమాచారాలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలుసుకున్నారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రస్తుతం ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. ఇకనుంచి ప్రతినెలా మూడో శనివారం వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గతంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్ళద్దాలు, మందులు పంపిణీ చేశారు. శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 292 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 262 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు. మూడు విడతలలో వారిని కంటి ఆపరేషన్లకు గుంటూరుకు తరలిస్తామని తెలిపారు.

ఆటో ఢీకొని బైకిస్టుకు తీవ్రగాయాలు

ముండ్లమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పులిపాడు గ్రామానికి చెందిన ఉప్పుటూరి రమణారెడ్డి ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్ళి తిరిగి వస్తున్నాడు.

ఈక్రమంలో పులిపాడు సమీపంలో దర్శి వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టడంతో రమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో దర్శిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

కురిచేడు, మే 17(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం వెంగాయపాలెం గ్రామ పొలిమేరలో ఉన్న నరసాయపాలెం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటుచేసింది. భక్తులు జీవాలను తీసుకువచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు.

దర్శిలో వాహనాల తనిఖీ



ఆటోలను తనిఖీలు చేస్తున్న ఒంగోలు మోటారు వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, రవాణాశాఖ అధికారులు

దర్శి, మే 17(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో శనివారం రవాణా, ఆర్టీసీ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు మోటారు వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు జరిమానాలు విధించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలకు, పరిమితికి మించి ఎక్కువమంది ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలకు జరిమానాలు విధించారు. ఈసందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తుచ తప్పకుండా పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయాత్రకు రావాలని ఉగ్రకు ఆహ్వానం

పామూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పామూరులో ఈనెల 22న జరుగనున్న విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, హైందవ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగే శ్రీహనుమాన్ శోభాయాత్రకు ముఖ్య అతిథిగా రావాలని కోరుతూ ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య ఆహ్వానించారు. శనివారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు యరవ శ్రీనివాసులు, పాలపర్తి రమణయ్య, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ జమకాల నరేష్, జె.చినసుబ్బయ్య, నవీన్, పి.విజయకుమారచారి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, మే 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా ఆయన తహసీల్దార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దర్శి పట్టణంలో అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎస్ఐ ఎం.మురళి, తదితరులు పాల్గొన్నారు.

జేఆర్‌కే ఫౌండేషన్ ద్వారా చలివేంద్రం ఏర్పాటు

పామూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం దోహద పడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. శనివారం మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో జేఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీను, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, కోటపాటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ వై.బాల, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రంగస్వామి పాకాల గ్రామంలో ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా చేతి పంపు మోటారును కూడా ప్రారంభించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పామూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో తగినన్ని మిషన్లు లేకపోవడం, కొన్ని మిషన్లు మరమ్మతులకు గురి కావడంతో శిక్షణకు వచ్చిన కొందరు మహిళలు నేలపైనే కూర్చొన్నారు. నెలరోజుల నుంచి శిక్షణకు వస్తున్నా ఇప్పటివరకు మిషన్ కేటాయించలేదని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మహిళలు తమ సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. మిషన్లను మరమ్మతులు చేయిస్తామన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా కుట్టుశిక్షణ ట్రైనర్ సెలవు పెట్టడంపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహారావు, స్రవంతి, సుచరిత పాల్గొన్నారు.

రెండురోజులపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముండ్లమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నందున ఆది, సోమవారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ అంకబాబు తెలిపారు. మారెళ్ళ, గంగన్నపాలెం, జమ్మలమడక, మక్కెనవారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

కురిచేడులో వర్షం

కురిచేడు, మే 17(ఆంధ్రజ్యోతి): కురిచేడులో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడికి తట్టుకోలేకపోయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.



ఉష్ణోగ్రత (అంచనా) 18-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	37	27
తెనాలి	36	28
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	37	28
చీరాల	35	28



అభివృద్ధి దిశగా.. అడుగులు

- నియోజక వర్గాల విజన్-2047కు కసరత్తు
- ఎమ్మెల్యే చైర్మన్‌గా కొలువు దీరనున్న బృందం
- సభ్యులుగా ఐదుగురు సచివాలయ ఉద్యోగులు
- విభాగాల వారీగా ప్రతి నెలా ప్రభుత్వానికి నివేదికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వస్తోంది. క్షేత్రస్థాయిలో సమస్యలు.. శాఖల వారీగా కార్యక్రమాల తీరుతెన్నులు.. ప్రజల సంతృప్తి.. తదితరాల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ప్రణాళికలపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. స్వర్ణాంధ్ర-2047 సాకారం కావాలంటే ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వం తలంచింది. ఇందులో భాగంగానే నియోజకవర్గాల వారీగా కసరత్తుకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టనుంది. దీనికి సమాంతరంగా అక్కడ ఉన్న వనరులు.. ఏ రంగంలో ఉపాధి కల్పనకు అవకాశం ఉంది.. ఇందుకోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం .. తదితర అంశాల ప్రాతిపదికగా కసరత్తు చేయనున్నారు. విజన్-2047లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే పాత్రను కీలకం చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో కన్వీనర్‌గా, ఐదుగురు సచివాలయ ఉద్యోగులు సభ్యులుగా ప్రత్యేక బృందం పనిచేయనున్నది. ఇందుకోసం ఐదుగురు సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియోజకవర్గ కేంద్రంలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టనుంది. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను సైతం మూడు జిల్లాల పరిధిలో అధికారులు పూర్తి చేశారు. ఇక నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేకంగా ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా విభాగాలు తయారు చేసే సవివర ప్రణాళికలను ముందుగా ఎమ్మెల్యేతో వాటి సాధ్యాసాధ్యాలపై చర్చించి నివేదికలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. పేదరిక నిర్మూలనతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పన, చివరి ఆయకట్టు వరకు సాగునీరు, గిట్టుబాటు ధరలే తొలి ప్రాథమ్యాలుగా ఉండనున్నాయి. ప్రతినెలా ఆయా కార్యక్రమాల అమలు నివేదికలను ప్రభుత్వానికి పారదర్శకంగా అందించాల్సిన బాధ్యతను సదరు బృందంపైనే ఉంది. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ప్రత్యేక అధికారుల నియామకం జరిగింది. వీరు కూడా బృందంతో కలిసి అడుగు లేయనున్నారు. ఇప్పటికే ప్రతి నెలా మూడో శనివారం ఓ థీమ్‌ను ఎంపిక చేసుకుని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిని మొక్కుబడి తంతుగా మార్చేయకుండా దాని ద్వారా వచ్చిన ఫలి తాలపై కూడా ప్రతి మూడు నెలలకొకసారి నియోజకవర్గ బృందాలతో సమీక్షించి సూచనలు చేసే దిశగా కూడా ప్రభుత్వం అడుగులేస్తోంది.

దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులు..

ఇందుకోసం బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. అయితే ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టినందున ఆయా నియోజకవర్గాల్లో వారి నియామకాల ప్రక్రియకు కొంత ఆటంకం కలుగుతున్నట్లు అధికారుల చెప్తున్నారు. గుంటూరు జిల్లాలో రెండు, బాపట్లలో మూడు, పల్నాడు జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఇంకా ఉద్యోగుల నియామకం జరగలేదంటున్నారు. ఈ నియామక గడువు ఏడాది ఉంటుందని, ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ముగించామని అధికారులు చెబుతున్నారు.

మట్టి పరీక్షలు.. మొక్కుబడిగా..



సరికొండ పాలెంలో మట్టి నమూనా సేకరణ

నానాటికీ నిస్సారంగా మారుతున్న నేల తల్లిని రక్షించి రైతులకు లబ్ధి చేకూరేలా భూసార పరీక్షలను చేపట్టాలి. ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. సాగుకు రైతులు సన్నద్ధమయ్యే నాటికి భూసార పరీక్షలు పూర్తి చేసి భూ ఆరోగ్య కార్డులు అందజేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో లక్ష్యంలో అర శాతం కూడా చేయ లేదు. మొక్కుబడిగా మట్టి నమూ నాలు సేకరించారే కానీ పరీక్షల విషయంలో పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని వ్యవసాయశాఖ లెక్కలు సూచిస్తున్నాయి. సాగుకు సమయం ఆసన్న మవుతున్న తరుణంలో భూసార పరీక్షల కార్డుల కోసం రైతులు ఎదురు చూస్తున్నా వ్యవసాయ శాఖలో చలనం లేదు. మట్టి పరీక్షలకు ఈ నెల 15న గడువు కాగా ఇప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. మూడు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అయితే ఇప్పటకి కేవలం 391 పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

- పుడమి ఆరోగ్య పరీక్షల్లో అలసత్వం
- మూడు జిల్లాల్లో 60,124 పరీక్షల లక్ష్యం
- ఇప్పటికి 391 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి
- గడువు దాటినా వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలను యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం సంకల్పించగా ఆచరణలో అది అమలు కావడంలేదు. మట్టి నమూనాలను సేకరిస్తున్నారే తప్ప పరీక్షలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నెల 15 కల్లా భూసార పరీక్షలు పూర్తి చేసి రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గడువు దాటినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలిస్తే పంటల సాగు ప్రారంభం నాటికి పూర్తయ్యే పరిస్థితులు కూడా కానరావడం లేదు. పరీక్షలే సక్రమంగా జరపలేదంటే ఇక రైతులకు ఏమాత్రం భూసార పరీక్షల కార్డులు అందాయో తెలుసుకోవచ్చు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. అదే విధంగా ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు తెలియజేస్తారు. నేల ఆరోగ్య పరీక్షలు ఆధారం గానే పంట సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్య పరీక్షలపై రైతులు ఆసక్తి చూపుతున్నా వ్యవసా యశాఖలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.



ఉప్పలపాడులో మట్టి నమూనాల సేకరణ

ఇలా సాగితే ఏడాదైనా కష్టమే..

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 18,158 మట్టి నమూనాలను సేకరించి 388 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. అంటే 2.10 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,287 నమూనాలను సేకరించి రెండింటికి పరీక్షలు పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాలను పరీక్షించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 9,784 నమూనాలను సేకరించి ఒక్క నమూనా పరీక్ష మాత్రమే చేశారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సేకరించిన నమునాల పరీక్షలకు ఇంకెన్ని రోజుల సమయం తీసుకుంటారో వ్యవసాయ శాఖ అధికారులకే తెలియాలి. పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి కూడా పూర్తి చేయడం అసాధ్యమని రైతులు చెప్తున్నారు. కనీసం పరీక్షలను వేగవంతం చేసి జూన్ కన్నా భూఆరోగ్య కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

భూసార కార్డులు ఉంటేనే సూక్ష్మపోషకాలు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఆయా సూక్షపోషకాల పంపిణీకి భూసార కార్డులను తప్పనిసరి చేసింది. ఆయా కార్డుల్లో సూచించిన మేర సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించనున్నా.. ఆ కార్డులు పంపిణీ ఇంతవరకు జరగలేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు సకాలంలో సూక్షపోషకాలు ఏమేరకు అందుతాయో తెలియాల్సి ఉంది.

జిల్లా	పరీక్షల లక్ష్యం	నమూనాల సేకరణ
పల్నాడు	23,437	18,158
బాపట్ల	22,825	14,287
గుంటూరు	13,862	9,784



దేవాలయం ప్రాకారం లోపల ఏర్పాటు చేసిన క్యూలైనులు

శింగరకొండలో మహా ఏర్పాట్లు

- రేపటి కుంభాభిషేకానికి సర్వం సిద్ధం

అద్దంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతిమండపం పునర్నిర్మాణం సందర్భంగా సోమవారం నిర్వహించే మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు సర్వం సిద్ధమవుతోంది. సుమారు 10 వేల మంది భక్తులు వేచి ఉండే విధంగా ఆలయ ప్రాకారం లోపల, బయట క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలోకి భక్తులు ప్రవేశించే సమయంలోనే వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. మహాకుంభాభిషేకానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఎండ లేకుండా ఉండేలా దేవాలయం నుంచి యాదవుల అన్నదానసత్రం వరకు రోడ్డుపై టెంట్లు ఏర్పాటు చేశారు. తిరుణాళ్ల సమయంలో రంగుల రాట్నాలు ఉంచే ప్రాంతంలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. అన్ని సత్రాల్లో కూడా అన్నదానాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపటి నుంచి.. ఈఏపీ సెట్

- మూడు జిల్లాలో 22 కేంద్రాలు
- 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ
- 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

గుంటూరు(విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ అగ్రికల్చరల్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వ హించే ఏపీఈఏపీ సెట్(ఆన్‌లైన్) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో బాపట్లలో రెండు, పల్నాడు జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగం విద్యార్థులకు 19, 22 తేదీల్లో, ఇంజనీరింగ్ విద్యార్థులకు 21 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు ఉం టాయి. ఆన్‌లైన్ కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా పరీక్షలకు మొత్తం 41,319 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఇంజనీరింగ్ పరీక్షకు 34,148 మంది అగ్రికల్చరల్, ఫార్మసీ పరీ క్షకు 7106 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని కోఆర్డినేటర్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అను మతించమని స్పష్టం చేశారు.

వేమూరులో.. సిందూర్ విజయోత్సవం

- తిరంగా ర్యాలీకి తరలివచ్చిన ప్రజలు, ప్రముఖులు
- దేశం ఉగ్రవాదాన్ని సహించదు : మంత్రి పార్థసారథి
- ప్రధాని మోదీ ఆలోచనా శక్తి గొప్పది : ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ శనివారం వేమూరులో జరిగింది. ప్రజలు, ప్రముఖులు పెద్దసంఖ్యలో తరలిరాగా జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేమూరులోని వేణు కేశవస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ర్యాలీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్యలకు నివాళులర్పించారు. జనవాహినితో నినాదాలు చేసుకుంటూ ర్యాలీ ఎన్టీఆర్ పురవేదిక వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశం ఉగ్రవాదాన్ని సహించదని ఆపరేషన్ సిందూర్‌తో నిరూపించామన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారతదేశాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. పాకిస్తాన్ ఉగ్ర ఆలోచనలకు సిందూర్ ద్వారా త్రివిధ దళాలు బుద్ధి చెప్పాయన్నారు. దేశ జవాన్లు చూపిన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ గర్వించాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా బుద్ధి చెప్పేందుకు ప్రధానమంత్రి మోదీ గొప్ప ఆలోచన చేశారని ప్రశంసించారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ పాకిస్తాన్‌కు సిందూర్ ద్వారా బలమైన జవాబు చెప్పారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, సర్పంచ్ లక్ష్మీతిరుపతమ్మ, నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదనప్రసాద్, రాజశేఖర్‌బాబు, సాయిబాబా, బీజేపీ నాయకుడు మందా జనార్ధన్ పాల్గొన్నారు.



వేమూరులో తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో తదితరులు



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రపరుస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్, ఆర్డీవో తదితరులు



జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణాన్ని సిబ్బందితో కలిసి శుభ్రం చేస్తున్న ఎస్పీ తుషార్ డూడి, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తదితరులు

ఆరోగ్యకర వాతావరణమే లక్ష్యం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఏఎస్పీ విఠలేశ్వర్, సిబ్బందితో కలిసి కార్యాలయ పరిసరాలను ఎస్పీ శుభ్రం చేశారు. చెత్త, వ్యర్థాలను తొలగించి మొక్కలకు నీరుపోశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదని అది మన అభివృద్ధికి పునాది వంటిదని చెప్పారు. శుభ్రమైన పరిసరాలు మన ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. వేసవిలో సహజమైన చల్లదనం కోసం టెర్రస్‌లపై ఆరోగ్యకరమైన మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు. పక్షుల దాహాన్ని తీర్చేందుకు టెర్రస్‌లపై మట్టిపాత్రల్లో నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. భూమిపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు పడేందుకు చెట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. మనం నాటిన మొక్కలు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా భావించి అందరు సమష్టగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాడు హామీ.. నేడు నిధులు

- సీఎం చొరవతో రూ.1.48 కోట్లు మంజూరు
- నిధులు మంజూరుతో మున్సిపల్ హైస్కూల్‌కు మహర్దశ
- వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని భవనసముదాయాన్ని పూర్తి చేయకుండా పనులను నిలిపేశారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం నిర్మాణ పనులపై ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో హైస్కూల్‌కు మహర్దశ పట్టింది. వైసీపీ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారు. గత ఏడాది డిసెంబరు 7న బాపట్లలో జరిగిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రి ఈ భవనాన్ని పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న సీఎం పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారం స్పెషల్ గ్రాంట్ కోటి 48లక్షల రూపాయలు మంజూరు చేశారు. దీంతో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరం నాటికి నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు పనులను వేగవంతం చేశారు. భవనం పూర్తయితే 30 తరగతి గదులు అందుబాటులోకి వస్తాయి.

చెట్ల కింద చదువులతో సరి..

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో హైస్కూల్ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులకు చెట్ల కింద చదువులు తప్పలేదు. నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పిన వైసీపీ పాలకులు ఈ భవనం పనుల ఊసెత్తలేదు. దీంతో గత ఐదేళ్లుగా పాఠశాలలో 919 మందికిపైగా విద్యార్థులు చాలీచాలని గదులతో ఇబ్బంది పడ్డారు. 2018-2019లో అప్పటి ఎంపీ శ్రీరామ్‌మాల్యాద్రి కృషితో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.2 కోట్లతో యూ అకారంలో రెండంతస్థుల భవన సముదాయాన్ని నిర్మించేలా పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరిట పాఠశాల అభివృద్ధికి రూ.78.57 లక్షలు మంజూరు చేసినా ఈ భవన సముదాయం పనులు పూర్తిచేయలేదు. పాతభవనం మరమ్మతులు, ఇతరపనులకు రూ.53.17 లక్షలు ఖర్చు చేశారు. రెండో విడత నాడు-నేడులో రూ.71.66 లక్షలు మంజూరు కాగా రూ.44.32 లక్షలు ఖర్చు చేసి గ్రౌండ్ ఫ్లోర్‌ను వినియోగంలోకి తెచ్చారు. దీంతో మిగిలిన రెండు ఫ్లోర్లు మొండిగోడలకే పరిమితమయ్యాయి. గతంలో 1300మందికిపైగా విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 919 మందికి పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో అత్యధికంగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో నెలకొన్న సమస్యపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా స్పందించి నిధులు మంజూరు చేయడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే గోడలు పగలకొట్టి కిటికీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులు చేస్తున్నారు.



తరగతి గదుల్లో కిటికీల ఏర్పాటుకు పగలకొట్టిన గోడలు

అవీ..ఇవీ..

భగవద్గీత ఆన్‌లైన్ పరీక్ష పోటీలో పర్చూరు వాసికి బంగారు పతకం



అవార్డు అందుకుంటున్న కోడూరి లక్ష్మీ, పక్కన శేషబ్రహ్మాచారి

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షలో ఈ ఏడాది పర్చూరుకు చెందిన కోడూరి లక్ష్మీకి బంగారు పతకం దక్కింది. ఈ సందర్భంగా మైసూర్ దత్తపీఠంలో శనివారం స్వామీజీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆధ్యాత్మికత జ్ఞానానికి ప్రతీకగా నిలిచే భగవత్‌గీతపై పట్టు సాధించి ప్రతిభను కనపరిచిన లక్ష్మీని పలువురు అభినందించారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ బహూకరణ



దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : నలుగురు చిన్నారి దివ్యాంగులకు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు వీల్‌చైర్స్ అందజేశారు. స్థానిక రోటరీ సామాజిక భవనంలో శనివారం అందుకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నలుగులు చిన్నారులు నడువలేక, నడుము క్రింద భాగము నుండి ఆరోగ్యంగా లేక నడువలేని స్థితిలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, సురేష్, పోలుదాసు రామకృష్ణ, శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, ప్రసాద్, హేమంత్‌కుమార్, జె సురేష్, ప్రతాప్, బాబురావు, పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు



మంజూరుపత్రం అందజేస్తున్న తహసీల్దార్

అద్దంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఎట్టకేలకు గ్రంథాలయం నిర్మాణానికి స్థలం కేటాయించారు. అద్దంకి పట్టణంలో ఐదు దశాబ్దాలుగా గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఎట్టకేలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థలం కేటాయింపు పై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్‌ఎస్‌పీ కార్యా లయం ఆవరణలో 10 సెంట్లు స్థలం కేటాయిస్తూ తహసీల్దార్ శ్రీచరణ్ మంజూరు పత్రంను లైబ్రరీ రికార్డు అసిస్టెంట్ వసుంధరదేవికి అందజేశారు. రిటైర్డ్ లైబ్రేరియన్ సుగుణరావు, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. స్థలం కేటాయింపుకు కృషి చేసిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తహసీల్దార్ శ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం స్పందనపై పొగాకు రైతుల హర్షం

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతుల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందనపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బర్లీ పొగాకు కొనుగోలు జరగక రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయారు. దీంతో రాష్ట్ర ఉన్నతశాఖ అధికారుల సారథ్యంలో కంపెనీ ప్రతినిధులు, రైతులతో ఇటీవల పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో బర్లీ రైతులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో దీనిపై కేంద్రప్రభుత్వాని రాష్ట్ర వ్యవసాయ శాఖ ద్వారా లేఖ కూడా రాయించారు. ఆయా కంపెనీల ద్వారా పొగాకును కొనుగోలు జరిగేలా ఆదేశాలు కూడా జారీచేశారు. దీనికి సంబంధించిన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను కూడా ఏర్పాటు చేసేవిధంగా ఆదేశాలు జారీచేశారు. కొనుగోలు లేక నైరాశ్యంలో ఉన్న బర్లీ రైతులకు ముఖ్యమంత్రి చొరవ కొంత ఊరటను చేకూర్చినట్లయ్యింది.

యద్దనపూడిలో ఆపరేషన్ సిందూర్ ర్యాలీ



యద్దనపూడి గ్రామంలో ఆపరేషన్ సిందూర్ ర్యాలీలో ఉద్యోగులు

యద్దనపూడి, (మార్టూరు)మే17: యద్దనపూడి గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు కె రవి కుమార్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనలు మేరకు రెవెన్యూ ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది జాతీయజెండాలను చేతబూని, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రికి వాట్సాప్‌లో వినతులు

- తొమ్మిది రకాల సమస్యలపైనే అధికం

ఒంగోలు విద్య, మే 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వాట్సాప్‌లో వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన మెయిల్‌కు కూడా వీటిని పంపుతున్నారు. ఉపాధ్యాయులుకానీ, ఇతరులు కానీ ఎవరైనా సమస్యలను తన వాట్సాప్‌కు పంపిస్తే స్పందిస్తానని మంత్రి లోకేష్ ప్రకటించారు. పాఠశాల విద్య కమిషనర్ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఉపాధ్యాయులు నేరుగా విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు తమ తొమ్మిది డిమాండ్ల పరిష్కారం కోరుతూ వినతులు పంపుతున్నారు. ఫౌండేషన్ స్కూళ్లలో 1,2 తరగతులే కాకుండా 1నుంచి 5 తరగతులు కొనసాగిస్తూ కనీసం ఇద్దరు టీచర్లను నియమించాలని, విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనే అవకాశం కల్పించాలని, మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఎస్‌జీటీలను హెచ్‌ఎంలుగా నియమించాలని ఎక్కువ మంది కోరుతున్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటితే ఒక హెచ్‌ఎం, ఐదు ఎస్‌జీటీ పోస్టులు ఇవ్వాలని, హైస్కూళ్లలో 1నుంచి 5 తరగతుల విలీనం ప్రతిపాదనను విరమించాలని, హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు వారానికి 32 పీరియడ్ల పనిభారం మించకుండా చూడాలని తదితర సమస్యలతో లోకేష్‌కు వాట్సాప్‌లో వినతులు పంపుతున్నారు.

ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు







ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన, మూలవిరాట్‌కు అభిషేకం చేస్తున్న ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు, యాగశాలలో పూజలు

అద్దంకి, మే17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ సోమవారం ఉదయం 9-03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో జరగనున్న నేపథ్యంలో బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 4వ రోజు శనివారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్‌కు నిర్వహించిన అభిషేకంలో ఈఓ తిమ్మానాయుడు, రిషిత దంపతులు, ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్ కుమార్, శ్రీవిద్య దంపతులు, మేదరమెట్ల శంకరారెడ్డి కుటుంబసభ్యులు హజరయ్యారు. శనివారం గురువందనం, గణపతిపూజ, మండప పూజలు, మహన్యాస పారాయణం, రుద్ర పారాయణం, సూర్యనమస్కారములు, మంత్ర అనుష్టాన ములు, వేదపారాయణం, సపుందరకాండ పారాయణం, అష్టోత్తర శతకలశస్నపనం, నాగవల్లీ దళార్చన తదితర పూజలు నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రదర్శించిన శ్రీరామాంజనేయం ప్రత్యేకనృత్య ప్రదర్శన, కూచిపూడి, భరతనాట్యం విశేషంగా ఆకట్టుకున్నాయి.



లక్ష్మీప్రసాద్‌కు రసీదు అందజేస్తున్న ఈవో

హాజరుకానున్న మంత్రులు

మహాకుంభాభిషేక కార్యక్రమాలు కార్యక్రమాలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హజరుకానున్నారు. సోమవారం ఉదయం 5 గంటలకు అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి శింగరకొండ వరకు సుమారు 1500 మంది మహిళలతో కలశయాత్ర నిర్వహించనున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ నుండి తీసుకు వచ్చిన ఏనుగు కలశ యాత్రలో ముందు భాగంలో నడవ నుంది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల తోపాటు ఉభయ తెలుగురాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణానికి విరాళాలు వెల్లువల వస్తున్నా యి. శనివారం కామేపల్లి గ్రానైట్స్ అధినేత కామేపల్లి లక్ష్మీప్రసాద్, సామ్రాజ్యం దంపతులు రూ.2,01,116, అద్దంకి మండలం నాగులపాడుకు చెందిన అడుసుమల్లి వెంకటేశ్వర్లు (ఏఏఎస్), అరుణ దంపతులు రూ.1,00,359, తిమ్మాయపాలెంకు చెందిన అల్లంనేని పూర్ణచంద్రరావు, పద్మజ దంపతులు రూ.1,05,116, అద్దంకి పట్టణానికి చెందిన చిన్ని అంజిబాబు, శ్రీదేవి దంపతులు రూ.1,01,116లు, వేముల పల్లేశ్వరరావు, శ్రీదేవి దంపతులు రూ.1,01,116లు విరాళాలను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన పుట్టా భాస్కరరావు, లక్ష్మి దంపతులు మారుతీభవన్‌లో ఒక గదిలో అవసరమైన ఏసీ, గీజర్, డబుల్‌కాట్, బెడ్‌లు ఏర్పాటుకు అవసరమైన నగదును ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, సందిరెడ్డి రమేష్, కోనేటి కళ్యాణ్, నూతి ప్రసాద్ పాల్గొన్నారు.

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్ కు శనివారం లక్ష త మలపాకులతో పూజ నిర్వహించారు. మహాకుంభాభిషేకము పూజలలో భాగంగా శనివారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. చీరాల ఆర్‌డిఓ చంద్రశేఖరనాయుడు శింగరకొండ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

400 మందితో బందోబస్తు

శింగరకొండ లో మహాకుంభాభిషేకము, జీవధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సోమవారం 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 30 మంది ఎస్‌ఐలు బందోబస్తు పర్యవేక్షిస్తారన్నారు. అద్దంకి నుంచి శింగరకొండ వరకు సోమవారం ఉదయం కలశయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో నామ్ రోడ్డులో ఆ సమయంలో ట్రాఫిక్‌ను మేదరమెట్ల వద్ద నిలిపివేయనున్నారు. మహాకుంభాభిషేకానికి వచ్చే వాహనాలను శ్రీరామజీవన సంఘం సత్రం వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఖాళీ స్థలాలలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

జానపద కళలను బతికించుకోవడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న జానపద కళాపీఠం అధ్యక్షుడు దేవపాలన

అద్దంకిటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): కనుమరుగు అవుతున్న జానపద కళలను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) అన్నారు. అద్దంకి జానపద కళలకు పుట్టినిల్లు అన్నారు. శనివారం రాత్రి అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు స్మారక కళావేదికపై జానపద కళాపీఠం అద్దంకి రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఉదయం చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో బౌద్దం-జానపదం ఉపన్యాస వేదిక జానపద కళాపీఠం కార్యదర్శి జ్యోతి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బౌద్దంలోని ఆర్థిక సాంఘీక రాజకీయ దృక్పథాలు, బౌద్ధం-సామాజిక చైతన్యం, జానపదాలు-జ్ఞానపదాలు అనే అంశాలపై వక్తలు ఉపన్యాసాలు చేశారు. సాయంత్రం ప్రజల పాటలు, కోలాటం, డప్పు విన్యాసాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అకట్టుకున్నాయి. అనంతరం సాహిత్య, కళా పురస్కారాల సభలో డాక్టర్ కొండా శ్రీనివాసులుకు జ్యోతి శ్రీరాములు స్మారక సాహిత్య పురస్కారమును, కారుమూరి సీతారామయ్యకు వీ రవల్లి రంగయ్య, యశోదమ్మ స్మారక కళాపుస్కారాన్ని, బత్తుల ఆంజనేయులకు గుర్రం జాషువా స్మారక సాహితీ పురస్కారాలను జ్యోతి శ్రీనాధ్, శ్రీమన్నారాయణ, శ్రీరామమూర్తి, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), మారెడ్డి సుబ్బారెడ్డిలు ప్రదానం చేశారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు అర్దేటి సుబ్బారావును కళాపీఠం సభ్యులు ఆత్మీయ సత్కారం, ఇతర కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు. దేవపాలన, కోశాధికారి శ్రావణ్‌కుమార్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, రామాంజనేయులు, చప్పిడి వీ రయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణకు జవాన్లు వీరోచిత పోరాటం



గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

పంగులూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో శనివారం ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైనిక దళాలకు సంఘీబావంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. 'భారత్ మాతాకి జై, దేశ ఐక్యత వర్థిల్లాలి, జోహార్ మురళీనాయక్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎం.పీ.డీ.ఓ. స్వరూపారాణి, గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, మాజీ జడ్.పి.టి.సి కె.వి.సుబ్బారావు, అడ్డగడ సుబ్బయ్య, మురకొండ సుబ్బారావు, సతీష్, కసుకర్తి సత్యనారాయణ, కార్యదర్శి కళ్యాణి, వి.ఆర్.ఓ. పరుశురామిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేణంగివరంలో

మండలంలోని రేణంగివరం గ్రామంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు బొరెడ్డి ఓబుల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎల్.సునీత నేతృత్వంలో గ్రామస్థులు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ పుర వీదులలో సంఘీబావ ర్యాలీ నిర్వహించారు. ప్రదాన కూడలిలో జాతి ఐక్యతను చాటుతూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపాలెం (చీరాల) : పాక్ ఉగ్రవాదులపై వీరోచితంగా పోరాడి భారత సైనికులు దేశ రక్షణకు పాటుపడ్డారని పలువురు నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ చేశారు. చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉల్లారెడ్డి, రాంబాబు, ఏడుకొండలు, కృష్ణారెడ్డి, పొదుపు సంఘాల మహిళలు, టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల





విశేష అలంకరణలో పోలేరమ్మ, శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వాడరేవు (చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగాయి. 14వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తులు వేకువ నుండే అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీముద్రగిరి పావనము అమ్మవారి సముద్ర స్నానము, పూజ ఊరేగింపు, సద్ది నైవేద్యాలు, వడపప్పు, పానకాలు, శిడిమాను ఉత్సవాలు, పొంగళ్లు ఘనంగా నిర్వహించారు. అంతే కాకుండా రాత్రికి విజయవాడ వారిచే పాట కచ్చేరి, కోలాటం, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని పూజలు చేశారు.

నేడు పోలేరమ్మ పొంగళ్లు

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ద్వారకపాడు గ్రామంలో ఆదివారం పోలేరమ్మ గుడి వద్ద భక్తులు పొంగళ్లు పెట్టనున్నారని కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి పోలేరమ్మ గుడి నుండి అమ్మవారిని భక్తులు ఊరేగింపు, కోలాహలం మధ్య గ్రామోత్సవం చేశారు. ఆదివారం ఉదయం పొంగళ్లు సాయంత్రం అన్నదానం నిర్వహించనున్నారు.

దొంగ అరెస్టు

- రూ.14.6లక్షల విలువ చేసే ట్రాక్టర్‌లు, రొటావేటర్ ట్రక్కులు స్వాధీనం

పుల్లలచెరువు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టరు అపహరణ కేసును పోలీసులు చేదించారు. శనివారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రభాకర్, ఎస్ఐ సంపత్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్ షెడ్డులో ఉంచిన ట్రాక్టరు, రొటావేటర్‌ను దొంగలు అపహరించారు. బాధితులు శంకరరావు, వాగ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నిందితుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురం గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్ అలియాస్ మాస్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చేపట్టారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గుట్లపల్లి వద్ద హుస్సేన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు తాను చేసిన దొంగతనాల వివరాలను చెప్పాడు. పుల్లలచెరువు మండలంలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టర్, రొటావేటర్, ఐటీవరం గ్రామ సమీపంలో ఉన్న ట్రాక్టరు ట్రక్కు, త్రిపురాంతకంలో నిలిపి ఉన్న మంచినీటి ట్యాంకర్, ముటుకులలో ఇటుకల బట్టీ వద్ద ట్రాక్టరు ట్రక్కును దొంగిలించాడు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.14.6లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నిందితుడిని మార్కాపురం కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. అతి తక్కువ కాలంలో కేసును ఛేదించిన పుల్లలచెరువు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పు భూములను పరిశీలించిన అధికారులు



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో

చినగంజాం, మే 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం సర్వే నెంబరు 608 లోని ఉప్పు భూములను శనివారం అధికారులు పరిశీలించారు. జిల్లా రిజిస్ట్రార్ శైలజ, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి తూమాటి చంద్రశేఖర్ నాయుడు అధికారులతో కలిసి చినగంజాం ప్రాంతంలోని ఉప్పుభూములను, భూముల మ్యాప్‌ను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూములను పరిశీలించి, భూములలో రైతులు ఉప్పు పండిస్తున్నారా..? లేదా..? సాగు చేయకుండా ఖాళీగా ఉంచారా, భూముల మార్కెటు విలువ ఎంత ఉంటుంది, ఇవి వ్యవసాయేత్ర భూములకు పనికొస్తాయా..? ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు తదితర విషయాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్.ఐ బండారు దానియేలు, మండల సర్వేయర్ జీవి.సుబ్బారావు, సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఉప్పు రైతులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ ఆత్మారావు

చినగంజాం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చినగంజాం గ్రామసర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో చినగంజాం గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పనుల నిమిత్తం గ్రామానికి వచ్చే పరిసర ప్రాంతాల ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామసర్పంచ్ సూచించారు. వేసవి కాలం ముగించే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏ.ఈ పి.బసవరాణి, ఏపీవో జె.లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి అంజయ్య, టీడీపీ నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, ఎం.లక్ష్మయ్య, ఏసోబు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

చినగంజాం, మే.17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై పరీక్షలు నిర్వహించి, బహుమతులు అందజేసినట్లు గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్‌లో పెయింటింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు శనివారం పరీక్షలు నిర్వహించారు. పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు దాత, రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆర్ఎస్‌వీ.పోతురాజు బహుమతులు అందజేసినట్లు గ్రంథపాలకులు తెలిపారు. పరీక్షలలో పాల్గొన్న విద్యార్థులందరికీ జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్.నరసింహారావు పెన్నులు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ వై.రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు పోలీసుస్టేషన్‌కు గ్రానైట్ అసోసియేషన్ డ్రోన్ బహూకరణ

మార్టూరు, మే17 (ఆంధ్రజ్యోతి): మార్టూరు పోలీస్‌స్టేషన్‌కు మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ వారు డ్రోన్ ను బహుకరించారు. సమాజంలో నేరాల నియంత్రణకు,శాంతి భద్రతల పర్యవేక్షణకు నిరంతరం పనిచేస్తున్న మార్టూరు స్టేషన్‌కు తమ వంతు బాధ్యతగా గ్రానైట్ అసోసియేషన్ వారు రూ.1.60 లక్షల విలువైన మావిక్ ఎయిర్ 3ఎస్ డ్రోన్‌ను స్టేషన్ కు అందచేశారు. గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, తేలప్రోలు శ్రీనివాసరావులు డ్రోన్‌ను, డీఎస్పీ రామాంజనేయులు, సీఐ యం శేషగిరిరావు ల సమక్షంలో జిల్లా ఎస్పీ తుషార్‌డూడీకి అందచేశారు.

అవీ..ఇవీ..

మహిళలపట్ల అసభ్య ప్రవర్తన

- నిలదీసిన వ్యక్తిపై పలువురి దాడి
- ఘటనపై ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల పట్ల అసభ్య ప్రవరించడంతో పాటు అడ్డుకున్న భర్తపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన ఓ కుటుంబం రెండు రోజుల క్రితం రామాపురంలోని సముద్రతీరానికి వెళ్లింది. ఈ క్రమంలో స్నానాలు చేస్తుండగా అటుగా వెళ్తున్న ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆ కుటుంబలోని మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో నిలదీసిన భర్తపై కూడా దాడిచేశారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మార్టూరు,మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన తాతా తిరుపతిరాయుడు (34) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం వేకువజామున మృతిచెందారు. ఆ వివాహితుడైన ఆయన శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో గడ్డిమందు తాగడంతో ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుని తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పులి అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహహింసపై కేసు నమోదు

మార్టూరు, మే17(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం తన భర్త ఆయన కుటుంబ సభ్యులు తనను శరీరకంగా మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని మార్టూరు గ్రామంలోని ముస్లింకాలనీలో నివాసం ఉంటున్న మునిపల్లి రిజ్వానా అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు భర్త అత్తమామలు ఆడపడచులపై శుక్రవారం రాత్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా శనివారం తెలిపారు.

ఆటో బోల్తా- వ్యక్తికి గాయాలు


గాయపడ్డ చెన్నారెడ్డి

చినగంజాం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి బోల్తా కొట్టడంతో వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకొంది ఈ ఘటన చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య ఉన్న సాయిబాబా మందిరం సమీపంలో చోటు చేసుకుంది. హైవే అంబులెన్స్ వారు తెలిసిన వివరాలు ప్రకారం ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఎదురు చెన్నారెడ్డి తన కారులో చీరాల నుండి ఒంగోలు వెళ్తున్నాడు. ఆయన మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడు. సాయిబాబా ఆలయ సమీపంలోనికి వచ్చేసరికి మద్యంమత్తులో ఉన్న చెన్నారెడ్డి కారును రోడ్డు పక్కకు నడుపుతుండగా అదుపు తప్పి 216వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న పంట కాలువలోనికి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో చెన్నారెడ్డికి రక్తగాయాలయ్యాయి. ఆయన్ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి నగదు ప్రోత్సాహం


దివ్యశ్రీకి నగదు ప్రోత్సాహం అందిస్తున్న పేర్నేటి శ్రీరామ్ ప్రసాద్

పందిళ్లపల్లి(చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని సజ్జా దివ్యశ్రీకు మచిలీపట్నంలోని ఓ కళాశాల వ్యవస్థాపకులు, కృష్ణాజిల్లా మానవతా సంస్థ అధ్యక్షులు పేర్నేటి శ్రీరామ్‌ప్రసాద్ రూ.25 వేలు నగదు ప్రోత్సాహం అందజేశారు. దేశాయిపేటకు చెందిన శ్రీరామ్‌ప్రసాద్ శనివారం మచిలీపట్నంలో ఆయన కళాశాలలో దివ్యశ్రీకు ప్రోత్సాహకం అందిం చారు. దివ్యశ్రీ ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 596 మార్కులు సాధించింది. దీంతో దివ్యశ్రీకు ప్రోత్సాహకం అందించి నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధులకు మందుల పంపిణీ

మార్టూరు, మే17 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆశ్రమంలో శనివారం మార్టూరు ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా వేసవి కాలంలో వృద్ధులు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యాధికారిణి అంజమ్మ తెలిపారు. అనంతరం 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంజమ్మతో పాటు, అసిస్టెంట్ శేష సాయి తనూజ, ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

దయనీయ స్థితిలో బర్లీ పొగాకు రైతులు


మండెలు వేసిన పొగాకు రైతులు

- కొనేవారికోసం ఎదురు చూపులు
- ముఖం చాటేస్తున్న వ్యాపారులు
- నైరాశ్యంలో సాగుదారులు

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. చేతికి వచ్చిన పంటను అమ్ముకోలేక వారు నానా అవస్థలు పడుతున్నారు. కొనేవారి కోసం ఎదురు చూపులు చూస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

మరో వైపు అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చమని ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఉన్న పొగాకును తులానికో ఫలానికో అమ్ముకొని అప్పులు తీర్చుకుందామన్నా, వ్యాపారులు ముఖం చాటేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి రాష్ట్రస్థాయిలో ఉన్నత అధికారులతోపాటు, కంపెనీ ప్రతినిధులతో రివ్యూలు నిర్వహించినా ఫలితం లేకపోవడం బర్లీ రైతులను మరింత కలవరానికి గురిచేస్తోంది. నిన్న మొన్నటి వరకు అరకొర ధరకు అడిగిన వ్యాపారులు ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో అన్నదాతలు కన్నీరు పర్యంతరం అవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పొగాకు రైతుల పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా బర్లీ పొగాకు మండెలే దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఈఏడాది సాగుదారుల్లో అత్యధికం కౌలు రైతులే ఉండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే లక్షలు ఖర్చుచేసి అప్పులు చేసి మరీ సాగు చేసుకున్నామని పంట చేతికి అంది వచ్చి నెలలు గడుస్తున్నా కొనేనాథుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు, వ్యవసాయ ఖర్చులు కలుపుకొని ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చుఅయ్యిందని రైతులు వాపోతున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోనే అత్యధికంగా బర్లీ పొగాకును రైతులు సాగుచేసుకున్నారు. వ్యాపా రులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేయాలన్న ఆలోచనతో మొఖం చాటువేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉంటే ఎండకు వానకు పొగాకు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ధర ఆశాజ కంగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు పొగాకు సాగుచేశారు. ఇదే సమయంలో పొగాకు కంపెనీలు సైతం తమ ప్రతినిధులను రైతుల వద్దకు పంపించి కొనుగోలు హామీ ఇప్పించాయి. సాగైన పొగాకును తామే కొను గోలు చేస్తామని రైతులకు హామీ ఇప్పించాయి. ప్రస్తుతం సదరు కంపెనీలు ముఖం చాటేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసే విధంగా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

పర్చూరులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలింపు


మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన స్థానికులు

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు గుర్తుతెలియని మృతదేహం వెలుగుచూడడం సంచలనంగా మారింది. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని పంచాయితీరాజ్ భవనం ప్రహరీగోడ వెంబడి ఇటీవల వర్షానికి చేరిన నీటిలో శనివారం మృతదేహం పడి ఉంది. గుర్తించిన వాహనదారులు ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై మాల్యాద్రి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం పడిఉన్న తీరు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం నీటిలో నుండి మృతదేహాన్ని వెలికి తీయించి రెవెన్యూ సిబ్బంది సారధ్యంలో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న యువకుని మృతదేహం ఇలా అనుమానాస్పదంగా పడిఉండటం చర్చనీయాంశంగా మారిం ది. మృతదేహం శరీరంపై కేవలం షాట్ మాత్రమే ధరించి ఉన్నారు. గుర్తు తెలియని మృతదేహం వెలుగు చూడడంతో పెద్ద ఎత్తున ప్రజలు ప్రాంగణా నికి తరలివచ్చారు. మృతదేహం ఎవరిది, ప్రమాదవ శాత్తు మృతి చెందాడా, మరి ఏఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. అయితే గుర్తు తెలియని వ్యక్తి కావటంతో మృతదేహాన్ని స్థానిక మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు సాయం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత


నిత్యావసరాలు అందజేస్తున్న అనిల్‌కుమార్

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : పూట గడవక అవస్థల్లో ఉన్న నిరుపేదలకు సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ గంటా అనీల్ కుమార్ పేర్కొన్నారు. నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక సాయకాలనీ, ఎన్‌టీఆర్ నగర్‌లోని యానాది కాలనీకు చెందిన 20 నిరుపేద కుటుంబాలకు రూ.10 వేల విలువైన నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గత తొమ్మిదేళ్లగా తన తల్లిదండ్రుల పేరు మీదగా నిస్వార్థంతో కులమతాలకు తావులేకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు నిరుపేద కుటుంబాల ప్రతినిధులు సాయం పొందారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

తిమ్మరాజుపాలెం(పర్చూరు), మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుడులు సాధించవచ్చని రైతుసంఘం అధ్యక్షులు గోరంట్ల రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధింకంగా ఉందన్నారు. దీనివల్ల ఖర్చు పెరిగిపోవడంతోపాటు, భూములు నిస్సారంగా మారతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించటం జరిగిందన్నారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించే విధంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్, వీఏఏ గిరిధర్, యూనిట్ ఇన్‌చార్జి దాసరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డుదారులకే ప్రభుత్వ పథకాలు

పంగులూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పంటసాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు దక్కాలంటే సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని పంగులూరు, చందలూరు గ్రామాలలో శనివారం కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. పంటరుణంతో పాటు అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు ఇతర ప్రయోజనాలకు కౌలుదారు కార్డు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, ఆర్ఐ. శ్వేత, వీఆర్‌వోలు చింపారావు, పరవురామిరెడ్డి, వీవోఏలు అమృత, నవనీత, ప్రియ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అధికారులు
- మొక్కల పెంపకం ఆవశ్యతపై ప్రజలకు అవగాహన

చినగంజాం, మే 17(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, తిరంగా ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు అన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు త్రివర్ణ పతకాలను చేతపట్టి భారత్ మాతాకీ జై, అమరజీవి మురళినాయక్, జయహో భారత్ అనే నినాదాలు చేస్తూ ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. తదనంతరం సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏ.ఈ బసవరాణి, గ్రామ కార్యదర్శి అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండల కార్యాలయంలో పారిశుధ్ధ్య కార్మికులకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై శనివారము అవగాహన కార్యక్రమం నిర్వహించారు పరిసరాలను పరిశుభ్రంగా ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ రవి సూచించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మండల కార్యాలయ అధికారులు వైద్యసిబ్బంది పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు

పంగులూరు : వ్యాధులు దరి చేరకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. పంగులూరు పీహెచ్‌సీలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, స్టాఫ్‌నర్స్ రాఘవమ్మ, ఎల్‌టీ. హరిచందన, పద్మావతి, రాజారెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నారు. శనివారం మండలంలోని జార్లపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మే మాసం థీమ్‌గా బీట్ ద హిట్ కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలో కార్యక్రమం నిర్వహించి ప్రజలకు మొక్కలు నాటడం వలన ఉపయోగాలు, ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన సింగయ్య, ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాద్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంగులూరు : వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి వ్యక్తి మొక్కలు నాటి చెట్లను పెంచాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎండనుండి కాపాడుకుందాం అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. బీట్ ద హీట్ అంటూ గ్రామంలో మొక్కలునాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సర్పంచ్ కృష్ణారావు, కేవీ.సుబ్బారావు, ఈవోఆర్‌డీ సుమంత్, పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీఎం జ్యోతిప్రసాద్, కార్యదర్శి కల్యాణి, వీఆర్‌వో పరుశురామిరెడ్డి, మురకొండ సుబ్బారావు, పెంట్యాల వెంకటేశ్వర్లు, అడ్డగడ సుబ్బయ్య, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మేదరమెట: గ్రామస్థులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాధా మాధవి అన్నారు. శనివారం మేదరమెట్లలో స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆమె హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తడి, పొడి చెత్త వేరువేరుగా పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయ్యాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా రోడ్డు పక్కన పెట్టిన చెత్త కుండిలలో వేస్తే పంచాయతీ సిబ్బంది వాటిని తొలగిస్తారన్నారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి మాట్లాడుతు పంచాయతీ సిబ్బంది బాధ్యతగా పని చేసి చెత్త నిల్వలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మికాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల : వడగాలులు, ఎండతీవ్రత ప్రభావానికి గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బాబోయ్ వడగాలులు', పది మంది మృతి అంటూ కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో శనివారం మండల పరిధిలోని ఈపూరుపాలెంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపిడివో శివసుబ్రహ్మణ్యం పాల్గొని ఎండతీవ్రత కలుగు నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఆర్డీవో అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. డీఎల్‌పీవో శివన్నారాయణ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే తోటవారిపాలెంలో పంచాయతి కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో తిరంగా విజయోత్సవ ర్యాలీ జరిగింది .కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, నాదెండ్ల కోటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.


పంగులూరు, అద్దంకిలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ర్యాలీలో ప్రజలు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చక్కని భరోసా అని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో 27 మందికి రాష్ట్రప్రభుత్వం నుంచి విడుదలైన రూ.28,03,459 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం సామాన్య ప్రజలకు వైద్యం సాయం అందించే ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, కూటమి నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


చిన్నారుల విద్యావిధానంపై ప్రత్యేక దృష్టి

చీరాల : కూటమి ప్రభుత్వం విద్యా విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ఓట్ల హేమబిందు, మాచర్ల వెంకట హేమలత, అందె శ్వేత, కౌతవరపు ఉజ్వల, మద్రివాడ జ్యోష్నప్రియలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున గాల నరేష్ కృషితో ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు ప్రోత్సా హం అందజేశారు. క్రమ శిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సూచించారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.6	29.5
కావలి	36	27
ఆత్మకూరు	39	27
ఉదయగిరి	38	26
కందుకూరు	36	27

మన పూర్వీకులు ఎలా ఉండేవారు.. పాత్రలు ఎలా ఉండేవి.. అప్పటి రాజులు వాడిన ఆయుధాలు ఏవి!? నాణేలు ఏవిధంగా ఉండేవి? వాటిని ఏ లోహంతో తయారు చేసేవారు. శాసనాల మాటేమిటి!? ఉత్సవ విగ్రహాలు ఎలా ఉండేవి? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. నాటి వైభోగాన్ని కనులారా వీక్షించాలని అనుకుంటున్నారా!? అయితే, నెల్లూరుకు వచ్చేయండి. నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న జిల్లా మ్యూజియాన్ని సందర్శించండి. ఆదివారం అంతర్జాతీయ మూజియం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..





నాటి వైభోగం
నేటికీ సాక్షాత్కారం

- మ్యూజియంలో పదిలంగా..
- నేడు అందరికీ ఉచిత ప్రవేశం

మ్యూజియం భవనంలోకి ప్రవేశించిన వెంటనే ఎదురుగా శిల్ప కళాతోరణం మనల్ని ఆహ్వానిస్తుంది. ఇందులో మొత్తం 24 రాతి శిల్పాలు ఉన్నాయి. క్రీస్తు శకం 11 నుంచి 14వ శతాబ్దం కాలం నాటి విఘ్నేశ్వరుడు, విష్ణువు, గౌతమబుద్ధుడు, లక్ష్మీనారాయణుడు, వీరభద్రుడు వంటి శిల్పాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఉమ్మడి జిల్లాలోని నెల్లూరు, సూళ్లూరుపేట, బుచ్చి, పెనబర్తి, ఉదయగిరి తదితరల ప్రాంతాల నుంచి సేకరించి, ఇక్కడ ప్రతిష్ఠించారు.



● ఆది మానవుడి గురించి : మ్యూజియం లోపలి వస్తువులను చూడాలి అంటే ఆదిమానవుడి శిలా యుగ జీవన విధానం చూడాలి. ఆదిమానవుల జీవితంతోపాటు వారి రాతి ఆయుధాలు, మట్టిపాత్రలు, నిప్పును సృష్టించడం, మట్టి శవపేటిక, అంత్యక్రియలకు ఉపయోగించిన మట్టి పాత్రలు వంటివి మనల్ని ఆలోచింపజేస్తాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు, తాళ్లపల్లి గ్రామంలో జరిగిన తవ్వకాల్లో ఇవి బయటపడగా, ఇక్కడ భద్రపరిచారు.

● 19వ శతాబ్దపు శిల్ప కళా గ్యాలరీ : ఆదిమ మానవుల గ్యాలరీ తర్వాత 19వ శతాబ్దపు శిల్ప కళా గ్యాలరీకి చేరుకుంటాము. ఇక్కడ సున్నంతో చేసిన శిల్పకళ, మట్టితో చేసిన శిల్ప కళా వైభవం ఆకట్టుకుంటుంది.

● లోహపు పాత్రలు, శిల్పాలు : తర్వాత గ్యాలరీలో 18-19వ శతాబ్దంలో మన పూర్వీకులు వాడిన లోహపు పాత్రలు, శిల్పాలు కనిపిస్తాయి. వాటిలో చిద్రి పాత్రలు ప్రత్యేకంగా కనిపిస్తాయి.

● దారు శిల్పాలు : మన పూర్వీకులు తొలినాళ్లలో కొయ్యపై చెక్కిన దేవతామూర్తులను పూజించారు. తర్వాతి కాలంలో రాతి శిల్పాలు, లోహపు శిల్పాలను పూజిస్తున్నాము. వీటిలో సీతారామలక్ష్మణ విగ్రహాలతోపాటు టీపీగూడూరు మండలం కాటేపల్లిలో లభించిన శిల్పాలు ఉన్నాయి.



నెల్లూరు (సాంస్కృతికం) మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు విద్య, వినోదం, చరిత్ర సామాజిక జీవన వైవిద్యాలు తెలియజేసేందుకు.. ఒక సాంస్కృతిక, శాస్త్రీయ కళాత్మక విలువ కలిగిన వస్తువులు, కళలను, ఆధారాలను సేకరించి భద్రపరిచి, ప్రదర్శించడమే మ్యూజియం. ఒక్కసారి మ్యూజియంను సందర్శిస్తే మన చరిత్ర, విలువలు తెలుస్తాయి. ప్రతి ఒక్కరు మ్యూజియంను సందర్శించి, వాటిని విలువలను భావితరాలకు తెలియజేయాలి. నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు సమీపంలోని సరస్వతీనగర్‌లో నెల్లూరు మ్యూజియం భవనాన్ని 2006, జూన్ 4వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత కలెక్టర్ ఆనంద్ ఈ యేడాది ఆరంభంలో మ్యూజియంను సందర్శించి, మరమ్మతులను కార్పొరేషన్ ద్వారా చేయించారు.



నేడు అంతర్జాతీయ మ్యూజియం డే

● ప్రదర్శన వేళలు.. టిక్కెట్ల వివరాలు

ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు మ్యూజియం తెరిచి ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవు రోజుల్లో మ్యూజియం తలుపులు తెరుచుకోవు.

● ప్రవేశ రుసుము

పెద్దలకు ఒకరికి రూ.3, పిల్లలకు రూ.1. ఫొటోలు తీసుకోవాలంటే రూ.20. వీడియో తీసుకోవాలంటే రూ.100 టిక్కెటు తీసుకోవాలి. ఇక విదేశీయులు ఫొటోలు తీసుకోవాలంటే రూ.100, వీడియోకు రూ.500 చెల్లించాలి.

● త్వరలో అధునాతన సౌకర్యాలు

మ్యూజియంలో సాంకేతిక పరిజ్ఞానంతో సందర్శకులకు అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా పురావస్తు శాఖ సహాయ సంచాలకుడు, మ్యూజియం అధికారి గంగాధర్ తెలిపారు. మ్యూజియం డే సందర్భంగా ఆదివారం సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు.



● నాణేల గ్యాలరీ : మ్యూజియంలో ఆసక్తిగా తిలకించే గ్యాలరీ నాణేలు ఉన్నవే. రాష్ట్ర రాజధాని అమరావతి గ్రామంలో లభించిన విద్దాంక నాణేలు, రోమన్ కాలం నాటి నాణేలు, క్రీస్తు శకం 1 నుంచి 3వ శకం నాటి నాణేలు, విష్ణుకుండిడి కాలం, యాదవరాజులు కాలం నాటి నాణేలు, ఢిల్లీ సుల్తాన్, విజయనగర రాజులు, కుతుబ్‌షా, అసఫ్ జాహీ కాలం నాటి నాణేలను తిలకించవచ్చు. 7వ నిజాం కాలం 1918లో రూ.100, రూ.10 నోట్లు ముద్రించడం జరిగింది. 1919లో రూ.5 నోటు చెలామణిలో వచ్చిందనే విషయాలు పొందుపరిచారు.

● రాగి శాసనాలు : క్రీస్తు శకం 5 నుంచి 14వ శతాబ్దం వరకు ఆనాటి రాజరిక ప్రభుత్వాలు ప్రకటించిన రాగి శాసనాలను భద్రపరిచారు. వాటి వివరాలు ఆ గ్యాలరీలో ఉన్నాయి.

● రక్షణ కవచాలు, ఆయుధాలు : రాజుల కాలంలో వాడిన రక్షణ కవచాలు, ఆయుధాలనూ ఓ గ్యాలరీలో భద్రపరిచారు. 19వ శతాబ్దపు ఖడ్గాలు, విల్లు, అమ్ములపొది, ఈటెలు, డాలు, ఫిరంగి - గుండ్లు, పేలుడు పదార్థాలు, తుపాకీలు కనిపిస్తాయి. వాటిని తయారీకి వాడిన వారు, వాటి వివరాలు ఉన్నాయి.

● కంచు కళాఖండాలు : కంచుతో తయారు చేసిన వైష్ణవ, శైవమూర్తులు విగ్రహాలు ఆకట్టుకుంటాయి. అందులోనే విగ్రహాల తయారీ వివరాలను పేర్కొన్నారు. ఇక్కడే ఇందుకూరుపేట మండలం పల్లెపాడు గ్రామంలో 1921 జూన్ 4వ తేదీన ఏర్పాటు చేసిన గాంధీ ఆశ్రమం ఫొటో కనిపిస్తుంది.

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా అన్నదాతలకు ప్రయోజనం లేకుండా పోతోంది. గత ప్రభుత్వం ఆయా కమిటీల నాయకత్వ లోపం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో ఉన్న నిధులు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో కమిటీల ఏర్పాటు లక్ష్యం కాస్తా నీరుగారిపోతోంది. కూటమి ప్రభుత్వం రాకతో కమిటీలకు పాత వైభవం తిరిగి వస్తుందన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

ఆదాయం ఘనం..
సేవలు శూన్యం!

- వసూళ్లకే పరిమితమైన మార్కెట్ కమిటీలు
- అన్నదాతకు అందని సేవలు

జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) ఉన్నాయి. నెల్లూరు, కోవూరు, కావలి, కందుకూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, సర్వేపల్లి ఏఎంసీల పరిధిలో జిల్లావ్యాప్తంగా దాదాపుగా 21 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సెస్సు వసూలు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఒక్కో మార్కెట్ కమిటీకి ప్రభుత్వం రూ.కోట్లలో లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఏడాదికేడాది లక్ష్యాల్లో మార్పులు ఉంటాయి. ఏఎంసీల పరిధిలోని గోదాముల అద్దెలతోపాటు పంట ఉత్పత్తుల నిల్వలతోపాటు పంట ఉత్పత్తుల నుంచి సెస్సు రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. అయితే ఆ నిధులను రైతుల కోసం కాకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారు.

● రూ.కోట్లలో ఆదాయం

జిల్లాలోని 8 మార్కెట్ కమిటీల ద్వారా రుసుము రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. 2019-20లో రూ.28.40 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా 24.65కోట్ల వసూళ్లయ్యాయి. 2020-21లో రూ.31.14కోట్లకు 11.22 కోట్లు, 2021-22లో దాదాపు రూ.32 కోట్లకు 23.45 కోట్లు, 2022-23లో రూ.20.30 కోట్లకు 34.42 కోట్లు, 2023-24లో రూ.35.03కోట్లకు దాదాపుగా 32.51కోట్లు వసూళ్లయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగిస్తూ రైతులకు చేయాల్సిన మేలును పూర్తిగా విస్మరించింది. 2024-25కు సంబంధించి రూ.34.43 కోట్లు లక్ష్యం కాగా దాదాపు 31.67 కోట్లు వసూలు చేసినట్లు మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. 2025-26కు రూ.39.42 కోట్ల లక్ష్యాన్ని నిర్ధేశించారు. నెల్లూరు ఏఎంసీకి రూ.5.92 కోట్లు, కోవూరుకు రూ.11.11కోట్లు, కావలికి 7.27 కోట్లు, కందుకూరుకు రూ.3.75 కోట్లు, రాపూరుకు రూ.1.34 కోట్లు, ఆత్మకూరుకు రూ.4.5 కోట్లు, ఉదయగిరికి రూ.2.96 కోట్లు, సర్వేపల్లికి రూ.2.57 కోట్ల వంతున వసూళ్ల లక్ష్యం విధించారు.

● అన్నదాతలకు సేవలేవి!?

మార్కెట్ కమిటీల ద్వారా వస్తున్న ఆదాయంతో ఆయా మార్కెట్ యార్డుల్లో రైతులకు మౌళిక సదుపాయాలు కల్పించాలి. అదేవిధంగా రైతుబంధు పథకం ద్వారా వడ్డీలేని రుణాలు అందించాలి. పంట పొలాల నుంచి ప్రధాన రహదారి వరకు రహదారులు నిర్మించాలి. ఇంకా ఏడాదికి కనీసం నాలుగు వైద్యశిబిరాలు నిర్వహించాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ సేవలను పక్కన పెట్టేసింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో కమిటీ సేవలు తిరిగి ప్రారంభమవుతాయని, వడ్డీలేని రుణాలు అందుతాయని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం

మార్కెట్ కమిటీలు లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేసి సెస్సు వసూలు చేస్తున్నాం. అదేవిధంగా ఆన్‌లైన్‌లో చెల్లింపులపైనా అవగాహన కల్పిస్తున్నాం. దీంతో లక్ష్యాలను చేరుకోగలుగుతున్నాం. కమిటీల నియామకంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

- పి.అనితకుమారి, మార్కెటింగ్ శాఖ ఏడీ

లక్ష్మీనృసింహస్వామి
గోవిందా.. గోవింద!

- వేడుకగా శ్రీవారి జయంత్యుత్సవం
- భక్తులతో కిక్కిరిసిన మాలకొండ క్షేత్రం

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : గోవింద నామస్మరణలతో మాలకొండ క్షేత్రం మారుమోగింది. మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు శనివారం మాలకొండలో వేడుకగా జరిగాయి. వారంలో శనివారం ఒక్కరోజే ఈ ఆలయం తెరవడం.. అలాగే స్వామివారం జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణంతా కిక్కిరిసిపోయిది. క్యూలైన్లు కిటకిటలాడగా, ప్రత్యేక దర్శనం కోసం ఐదు గంటలకుపైగానే సమయం పట్టింది. ఆలయ అధికారుల అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో ఎక్కడికక్కడ దాతలు సాయంతో మజ్జిగ, మినరల్‌వాటర్, శీతలపానీయాలు, అన్నదానం, నీడ వసతికి షామియానాలు, తాటాకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే వైద్యశిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానాలు చేసి, గొడుగుబండ కింద మహిళా భక్తులు పొంగళ్లు పెట్టుకొని, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని మహా అన్నదానంను ఎమ్మెల్యేలు నాగేశ్వరరావు, మాలకొండయ్య ప్రారంబించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సౌజన్య దంపతులను పలువురు నాయకులు సన్మానించారు. కాగా, గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒకరిపై మరొకరు రాజకీయ విమర్శలు చేసుకొన్న ఎమ్మెల్యే ఇంటూరి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌లు జయంత్యుత్సవాల్లో ఒకరినొకరు చేతులు కలుపుకొని, ఆప్యాయంగా పలకరించుకోవడం అంతటా చర్చనీయాంశంగా మారింది.



మాలకొండలో భక్తుల రద్దీ

● మాలకొండ ఆదాయం రూ. 18,23,562

మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 18,23,562 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ.సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 6,52,100, అన్నదానం ద్వారా రూ. 6,16,126, లడ్డూప్రసాదం ద్వారా రూ. 3,24,680, తలనీలాలు ద్వారా రూ. 1,01,125లు ప్రధానంగా లభించినట్లు పేర్కొన్నారు.



గొడుగుబండ కింద పొంగళ్లు పెట్టుకుటున్న మహిళా భక్తులు



అన్నదానంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు నాగేశ్వరరావు, ఎంఎ కొండయ్య

కామాక్షితాయి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ సేవాకమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి ఆలయ ఆచార సంప్రదాయాలతో పురోహితులు, వేదపండితులు, అర్చకులు, వేదమంత్రాలు, మంగళమేళాలతో ఆలయం నుంచి పెన్నాదికి వెళ్లి అక్కడ పూజలు నిర్వహించి, పొట్టమట్టి తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో కలశస్థాపన చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాకమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణం జరగనుంది. సంతాన లేమితో బాధపడే మహిళలు ఈ కార్యక్రమంలో అర్చకులు ధ్వజానికి నివేదించిన కొడిముద్దలను పంపిణీ చేస్తారు.



పెన్నానదిలో పూజలు చేస్తున్న అర్చకులు

'సీ' కేటగిరీ ఆలయాలకు పాలకమండళ్లు

- నోటిఫికేషన్ జారీ
- ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లూరు (సాంస్కృతికం), మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీ కేటగిరీ కలిసిన ఆలయాల దేవస్థానాలకు ధర్మకర్తల నియమాకానికి నోటిఫికేషన్ జారీ అయ్యింది. సీ కేటగిరీలో రూ.5లక్షలుపైన రూ.25 లక్షల లోపు ఆదాయం కలిగిన ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని 45 దేవాలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు కొత్త రిజర్వేషన్ ప్రకారం 9 మంది కమిటీ మెంబర్లు నియమాకం జరుగుతుంది. 9 మందిలో 50 శాతం మహిళలు ఉండాలి. గతంలో ఈ ఆలయాలకు ఏడుగురు ధర్మకర్తలు ఉన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్తపాలసీలో ఒక నాయీ బ్రాహ్మణుడికి స్థానం కల్పించనున్నారు. ఐదుగురిని రిజర్వేషన్ ప్రకారం నియమిస్తారు. ఈ నెల 7వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చినట్లు సమాచారం. ఆయా దేవాలయాల నోటీసు బోర్డులలో నోటిఫికేషన్ నకళ్లను తగిలించి చేతులు దులుపుకున్నారు.



కందుకూరు, ముత్తుకూరు, కోవూరులలో శనివారం తిరంగా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఎన్డీఏ కూటమి నేతలతోపాటు అధికారులు త్రివర్ణ పతాకాలు చేతబూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం అడ్డదారులు
- కార్పొరేట్ విద్యాసంస్థలో వింత పోకడ

ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల నుంచి
నగదు రికవరీకి సిఫారసు

'అమృత్'పై చర్చా వేదికకు రా!
మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కు కావలి ఎమ్మెల్యే సవాల్

- వివరాలు 8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100): 525	



కర్నాటక గవర్నర్‌నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కావ్య

కావలి వాసికి డాక్టరేట్

కావలి, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎంఎస్ నాయకుడు తొట్టెంపూడి ప్రసాదరావు కుమార్తె కావ్య శుక్రవారం కర్నాటక వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఆరాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. బెంగళూరు వ్యవసాయవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన కావ్య జన్యుశాస్త్రం, మొక్కల పెంపకంపై చేసిన పరిశోధనలలో డాక్టరేట్ పొందారు. వ్యవసాయశాస్త్ర వేత్తగా రైతుల సంక్షేమానికి కృషి చేయటమే లక్ష్యం అని కావ్య తెలిపారు. ప్రస్తుతం బాపట్లలోని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టీచింగ్ అసోసియేట్‌గా పనిచేస్తున్నానని తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు


అమ్మవారి విగ్రహాన్ని తెస్తున్న భక్తులు

కావలిటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరీ విగ్రహ పునఃప్రతిష్ఠా కుంబాభిషేక మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చక బృందం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గుడి ఉత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవతా పూజ, బింబ శుద్ధి, హోమం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, వేలేటి నాగేశ్వరరావు, చీదెళ్ల రామచంద్రారావు, పోతుగంటి అలేఖ్య, కనమర్లపూడి నారాయణ, అమరా వేదగిరి, పీ సీవీసీ సత్యం, పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి పైపులైన్

● మంచినీరు వృథా


రోడ్డుపై పారుతున్న నీరు

లింగసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం ఆన కట్ట వద్ద ఉన్న చిల్లమొద్దులను శనివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా అంతర్గత మంచినీటి పైపులైన్‌కు ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి పగిలిపోయింది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఈ నీరు పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గుంతలు ఏర్పడి రోడ్డు దెబ్బతింటోంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కావలి : బీట్ ద హీట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, పోలీస్ అధికారులు


పోకూరు గ్రామ సచివాలయ ముందు ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ నరేంద్రదేవ్

గ్రామాల పరిశుభ్రతే 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' లక్ష్యం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రతే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యమని, ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. శనివారం జలదంకి మండలం కమ్మవారిపాలెంలో జరిగిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామసచివాలయంలో పంచాయతీ పాలకవర్గం, అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. గ్రామ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఎపిడి, తహసీల్దారు ప్రమీ, ఎండిఓ బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు కరియావుల అప్పలయ్యనాయుడు, పచ్చా పెంచలయ్యనాయుడు, మలినేని హరిబాబు, జయచంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డిలు పాల్గొన్నారు.

● కావలి : స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కావలి పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో ఉష్ణోగ్రతలను తట్టుకునే విధంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై మున్సిపల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రంకు రోడ్డులోని సెల్ఫీపాయింట్ వద్ద ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లి ప్రయాణికులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందచేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో, రెండో పట్టణ సీఐలు ఫిరోజ్‌ఖాన్, గిరిబాబు, ఎస్ఐలు, మున్సిపల్


కమ్మవారిపాలెంలో మొక్కలు నాటుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

ఆర్వో పణికుమార్, టీపీవో వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.

●లింగసముద్రం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ శ్రీనివాసులు, డిఆర్‌డిఏ ఏపిఎం డా. కె సింహాద్రి, ఆర్‌ఐ ఎం రమణయ్య, తదితర అధికారులు, సిబ్బంది స్థానిక వెలుగు కార్యాలయం నుంచి లింగసముద్రం వరకు పొదుపు గ్రూపుల మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాలతి, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, ఈసీ విజయకుమార్, టీడీపీ నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సీసీలు మాధవ, మాధవరావు, నారాయణమ్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్యాలపాడులో

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మాజీ సర్పంచు టీడీపీ నేత బత్తుల శ్రీనివాసులు, కె సుబ్బులునాయుడు, యల్లావుల మాధవ, పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో టీడీపీ నేత కొండూరి అశోక్‌కుమార్ చలివేంద్రం ఏర్పాటు చేసి, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎంఎం సుధాకర్, ఎఫ్ఏ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ సూచించారు. శనివారం మండలంలోని పోకూరు గ్రామ సచివాలయం వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత తమ శాఖ కార్యకర్తలతో కలిసి వలేటివారిపాలెం పంచాయతీలోని బండవారిపాలెంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●అల్లూరు : మండలంలోని పలు పంచాయతీలలో బీట్ ద హీట్ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో రజనీకాంత్ నిర్వహించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. చలివేంద్రాలు ప్రారంభించారు. అలాగే సచివాలయాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి వరప్రసాద్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●కొండాపురం : కొండాపురం మండలం ఆదిమూర్తిపురం, సాయిపేటలలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఆదిమూర్తిపురంలో ఎండిఓ ఆదినారాయణరావు, సాయిపేటలో గుడవల్లూరు సొసైటీ సిఈఓ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతీ నెలా మూడవ శనివారం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీలకు మహర్దశ

కొండాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమయిన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పంచాయతీలకు ప్రభుత్వం జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం పోసిందని చెప్పవచ్చు. పంచాయతీలకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సంఘం నిధులు విడుదలచేయడంతో పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని సంతరించకోనున్నాయి. దీంతో మండలంలోని అన్ని పంచాయతీలలో అభివృద్ధి పరుగులు పెట్టించవచ్చని పాలకులు అంటున్నారు.

మండలానికి రూ. 4 కోట్ల కేటాయింపు

మండలంలోని 19 పంచాయతీలుండగా 2021వ సంవత్సరంలో పంచాయతీ పాలకుల ఎంపికకొరకు ఎన్నికలు జరిగాయి. కొలువుదీరిన సర్పంచులు అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు. నిధులలేమితో పంచాయతీలలో వీధి లైట్లు సైతం మార్చుకోలేని స్థితిలోకి వెళ్లాయి. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చారు. కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో పంచాయతీలు నిధులలేమితో కొట్టు మిట్టాడాయి. గ్రామాలలో ప్రజలకు కనీసం తాగునీరు అందించలేని స్థితికి చేరాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీ కష్టాలనుచూసి అధికారంలోకి రాగానే పంచాయతీలకు మంచిరోజులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధులు విడుదలచేసిచేసి పంచాయతీలను ఆదుకుంటానని ఇచ్చిన హామీమేరకు కేంద్రం చొరవతో ఆర్థికసంఘం నిధులు విడుదలచేయించడం జరిగింది. జనాభా ప్రాతిపదికన మండలానికి రూ 4 కోట్లు విడుదలకానున్నాయి.

ఆర్థిక సంఘం నిధులతో మౌలిక వసతులు

మండలంలోని 19 పంచాయతీలలో 39 వేల జనాభా ఉన్నారు. 2 వేలకు పైగా జనాభా కలిగి 8 పంచాయతీలుండగా మిగిలిన 11 పంచాయతీలలో 2 వేలకులోపు జనాభా ఉన్నారు. జనాభా ప్రాతిపదికన ఒక్క వ్యక్తికి ఏడాదికి రూ 1000 చొప్పున ప్రభుత్వం విడుదలచేస్తుంది. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం సంవత్సరానికి రెండు విడతలుగా ఆయా పంచాయతీ ఖాతాలలో జమచేస్తుంది. ఈనిధులతో గ్రామాలలోని ప్రలజకు మౌలిక వసతులయిన తాగునీరు, పారిశుధ్యం, సీసీ రోడ్లు ఏర్పాటు, చెత్తనుండి సంపద తయారీకేంద్రాల నిర్వహణ, వీధిలైట్లు ఏర్పాటు తదితర పనులను చేసుకునేందుకు అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు విడుదలచేసిన నగదును బ్యాంకు ఖాతానుండి పక్కదారిపట్టించి పంచాయతీలను గాలికొదిలేశారు.

నిధులు సక్రమంగా వినియోగించాలి : ఆదినారాయణరావు, ఎంపీడీవో

15 వ ఆర్థిక సంఘం నిధులను తొలివిడతగా ప్రభుత్వం విడుదలచేసింది. పంచాయతీల ఖాతాలకు త్వరలో జమ అవుతాయి. జమ అయిన నిధులను ఆయా గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులుకల్పించేందుకు వినియోగించాలి.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

● పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం నుండి చుండికి వెళ్లే నేషనల్‌హైవేకు అతి సమీపంలోని పొలాల్లో విద్యుత్ స్తంబాలకు పిచ్చి మొక్కలు, పిచ్చి తీగలు, తుప్పర్లు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. పిచ్చి మొక్కలకు కరెంట్ సరఫరా అయితే మనుషులకు, పశువులకు, సన్నజీవాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అంతేగాకుండా పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు కూడ విద్యుత్ ప్రమాదాలు బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వలేటివారిపాలెంలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు

ఉగ్రవాదం అంతం అందరి లక్ష్యం కావాలి

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరులో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వివిధ పార్టీల కార్యకర్తలు, పట్టణ ప్రజలు

కందుకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అంతంచేయటమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం ద్వారా భారత త్రివిధ దళాలు తమ శక్తిసామర్థ్యాలను మరోసారి ప్రపంచానికి చాటాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైన్యానికి మద్దతుగా శనివారం సాయంత్రం కందుకూరులో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్, అంబేద్కర్ విగ్రహం మీదుగా సబ్ కలెక్టరు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 120 అడుగుల భారీ జాతీయ పతాకం ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జాతీయ జెండాను చేతబట్టి ముందుకు సాగగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, న్యాయవాదులు, వ్యాపారులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు జాతీయజెండాలు చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై నినాదాలతో పట్టణం మార్మోగింది. సబ్ కలెక్టరు కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపౌరుడు భారతసైన్యానికి సంఘీభావంగా నిలవాలన్నారు. సైన్యానికి సంఘీభావం ప్రకటించటంతో పాటు యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లకు నివాళులు అర్పించటమే లక్ష్యంగా ఈ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరజవాన్ మురళీనాయక్‌కు అశ్రునివాళులర్పించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాద్, జొన్నాదుల రాఘవులు, ఉన్నం భాస్కరరావు, మదన్, డాక్టరు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

చిల్లచెట్లతో మూసుకుపోయిన పంట కాలువలు, అలుగులు

లింగసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 7 చిన్నతరహా సాగునీటి చెరువులైన లింగసముద్రం పాత, కొత్త చెరువులు, విశ్వనాధపురం, వీఆర్ కోట, చినపవని, మేదరమెట్లపాలెం, మొగిలిచెర్ల చెరువులతో పాటు 8 పంచాయతీరాజ్ చెరువులకు చెందిన తూములు, పంట కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. అంతేగాక పంట కాలువలు చిల్లచెట్లతో నిండి పూడికతో నిండిపోయాయి. చెరువులు కూడా చిల్లచెట్లతో నిండి కీకారణ్యాలను తలపిస్తున్నాయి. అలాగే ఈ చెరువులకు నీటిని అందించే ఒరవలు, వాగులు కూడా పలు చోట్ల చెట్లతో నిండడంతో పాటు కొన్ని చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి. ఈ కారణాల వలన సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి.


చిల్లచెట్లతో నిండిన లింగసముద్రం పాత చెరువు

లింగసముద్రం పాత చెరువులో కూడా చిల్లచెట్లు నిండి ఉన్నాయి. అలాగే పంట కాలువలు, తూములు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే చెరువు అలుగు కూడా పూడికతో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉన్నాయి. అయితే మండలంలోని 7 సాగునీటి చెరువులు, 8 పంచాయతీరాజ్ చెరువుల అభివృద్ధికి మైనర్ ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం లింగసముద్రం కొత్త, పాత చెరువులు, వీఆర్ కోట, చినపవని సాగునీటి చెరువులకు, ఎర్రారెడ్డిపాలెం వీఆర్ చెరువు అభివృద్ధికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. కానీ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం రూ.10 లక్షలకు బదులు రూ.4 లక్షలు మాత్రమే మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు వచ్చాయని అధికారుల ద్వారా తెలిసింది. దీంతో ఈ నిధులతో ఏమి పనులు చేయాలో తెలియడం లేదని అధికారులు అంటున్నట్లు తెలిసింది. దీంతో రైతులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌తో కరిగిపోతున్న చుండి కొండ

● ఇష్టానుసారంగా తవ్వకాలు ● అనుమతులు లేకుండా కొండరాయి తరలింపు ● ప్రభుత్వ ఆదాయానికి గండి

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి రెవెన్యూ గ్రామంలోని కొండను కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేస్తూ యధేచ్ఛగా కొండరాయిని తరలిస్తుండడంతో రోజురోజుకు చుండికొండ కరిగిపోతోంది. అక్రమార్కులు ఏళ్ల తరబడి కొండను తొలిచేసి రాయిని గుట్టుచప్పుడు కాకుండా గృహనిర్మాణ లబ్దిదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిళ్లు కొండల్లో బ్లాస్టింగ్ చేసి పగలు రాయిని తొలిచి సైజులుగా చేసి అక్రమార్కులు విక్రయించుకుంటున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో కొండరాయిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమార్కులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, ప్రభుత్వానికి పైసా రాయిల్టీ చెల్లించకుండానే విక్రయంచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అంతేగాక పచ్చదనంతో అలరారే కొండ కళను కోల్పోతోంది. పశువులు, మేకలు, గొర్రెలకు మేత దొరికే కొండ కరిగిపోతుండడంతో పశు పోషకులు గొర్రెలు, మేకల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ కొండరాయి తవ్వకాలను అడ్డుకొని ప్రకృతి వనరులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అక్రమ బ్లాస్టింగ్‌తో రూపు కోల్పోయిన చుండి కొండ

అనుమతులు లేవు : తహసీల్దార్

చుండి కొండలోని కొండరాయి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

రెండో పంటకు నీరు విడుదల


ఎస్పీఎంకు నీరు విడుదల చేస్తున్న మధుబాబునాయుడు

బిట్రగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని ఎస్పీఎం మేజర్ కాలువ కింద ఉన్న రైతులకు రెండవ పంటకు కావలి ఉపకాలువ వద్ద నీటి సంఘం అధ్యక్షుడు కండ్లగుంట మధుబాబునాయుడు శనివారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన రైతుబిడ్డ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అధికారులతో మాట్లాడి రెండవ పంటకు నీరు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు సత్యప్రసాద్, శరత్ కుమార్, నీటిసంఘం అధ్యక్షుడు యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య, శ్రీహరి, మాజీ సర్పంచు రమేష్‌రెడ్డి, ఏఈలు నాగార్జున, మాధవరావు, గిరికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టెలు ప్రారంభం


పశువుల నీటితొట్లెలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో తదితరులు

కలిగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగిరి, వీరనకొల్లు, లక్ష్మీపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామి పథకం నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్లెలను శనివారం ఎమ్పీడీవో ప్రత్యూష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.


●వలేటివారిపాలెం: పశుపోషకులు, సన్నజీవాల పెంపకందారులు పశువుల నీటి తొట్లెలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని పోకూరులో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ అండ : మాలేపాటి


అంజయ్యకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన టీడీపీ బీసీ నేత నాటకరాణి భాస్కర్ తండ్రి నాటకరాణి అంజయ్య (72) శుక్రవారం రాత్రి మృతిచెందగా శనివారం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జక్కేపల్లిగూడూరు కమ్మవారిపాలెంకు చెందిన టీడీపీ నేత ముల్లంగి మధు తండ్రి వెంకటసుబ్బయ్య (70) శనివారం ఉదయం మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు కే రఘురాంనాయుడు, ముంతాల వెంకయ్య, ఎల్ సుధీర్ బాబు, ఐ రాంమోహన్‌రెడ్డి, పీ.సుబ్బారావు, ఎన్.శీనయ్య, శ్రీధర్ ఉన్నారు. బాధిత కుటుంబాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు.

ఉపాధి పనుల పరిశీలన


బొంతవారిపాలెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని బొంతవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు తిరిగి రావాలని తెలిపారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.



పెంచలోరుకు కల్యాణం జరుపుతున్న అర్చకులు

రాపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : తరలి వచ్చిన భక్తజనంతో పెంచలకోన క్షేత్రం కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడం, పాఠశా లలకు సెలవులు ఉండడంతో శుక్రవారం రాత్రికే భక్తులు కోనకు చేరుకున్నారు. శనివారం తెల్లవారు జామున జరిగే శ్రీవారి అభిషేకంలో పాల్గొన్నారు. ఉదయం దేవేరు లతో కల్యాణం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవ కార్యక్రమాలను అర్చకులు సంప్రదా యబద్ధంగా జరిపారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాదరం కుటుంబ సమేతంగా స్వామివారిని, ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి, ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పగలు సెగలు.. రాత్రి చినుకులు!


ఉదయగిరి రహదారులపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

ఉదయగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండదెబ్బకు ప్రజలు విలవిల్లాడారు. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై ఉదయగిరి దుర్గాన్ని సైతం కమ్మేసింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం కారణంగా మురుగు కాలువలు పొంగిపొర్లి వ్యర్థాలన్నీ రహదారులపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్, రహదారులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

● పిడుగుకుపాటుకు మేకల మృతి

మండలంలోని జీ.అయ్యవారిపల్లి పంచాయతీ దేకూరుపల్లిలో శనివారం రాత్రి పిడుగుపాటుకు ఐదు మేకలు మృతి చెందాయి. సుమారు రూ.50వేలు నష్టపోయినట్లు రౌతుల పేరయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల నుంచి నగదు రికవరీకి సిఫారసు

● ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైన నివేదిక

నెల్లూరు (హరనాధపురం) మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం రెండేళ్లుగా వివాదాస్పదంగా వార్తల్లో నిలుస్తోంది. నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యోగులు పదోన్నతులు పొందారని, వేత నాలు అందుకు అనుగుణంగా తీసుకున్నారని, కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం చేశారని ఆ శాఖలోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ అధికారులతోపాటు కిందిస్థాయి సిబ్బందిపై గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణ లు నిజమేనని జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి నివేదికలో తేటతెల్లమైనట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా వేతనాలు పొందారని, ట్రావెలింగ్ అలవెన్సులు, కారు అద్దెలు తదితర వాటిల్లో రూ.16.74లక్షల నగదు దుర్వినియోగం అయినట్లు ఆడిట్ రిపోర్టులో తేలినట్లు సమాచారం. ఈ మొత్తాన్ని ఉద్యోగుల నుంచి రికవరీ చేయడంతోపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసినట్లు సమాచారం. గతంలో నెల్లూరుకు చెందిన న్యాయవాది పాముల హరిప్రసాద్,లోకాయుక్తను ఆశ్రయించి ఎస్సీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై కూలంకషంగా వివరించారు. నాటి నుంచి ఎస్సీ కార్పొరేషన్‌లో కలకలం మొదలైంది.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ-1. 2, కామర్స్-1, 2 పరీక్షలతో ప్రశాంతగా ముగిసినట్లు ఆర్ఐవో టీ.వరప్రసాదరావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 8,681 మంది హాజరు కావాల్సి ఉండగా 7,965 మంది హాజర య్యారని, 716 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1085 మంది హాజరు కావాల్సి ఉండగా 1022 మంది హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారన్నారు. మొత్తం మీద ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌లు లేకుండా పరీక్షలను పూర్తి చేశామని, సోమవారం నుంచి స్పాట్ కూడా ప్రారంభమవుతుందని తెలిపారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోరిన కోరికలు తీర్చే కరుణామయి కామాక్షితాయి!

కోరిన కోరికలు తీర్చే కరుణామయి జొన్నవాడ కామాక్షితాయి, మల్లికార్జునస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 11 రోజులపాటు రోజుకో వాహనంలో ఆదిదంపతులు భక్తులకు దర్శనం ఇస్తారు. 27వ తేదీతో ముగియనున్న ఈ ఉత్సవాలకు తెలుగురాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తజనం భారీగా తరలిరానుంది.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)


● పెన్నాలో జాలరు వలకు చిక్కిన కాత్యాయిని.. ఆదిశంకరాచార్యులతో విగ్రహ పునఃప్రతిష్ఠ

● కశ్యప్రజాపతి యజ్ఞంతో స్వయంభువుగా మల్లికార్జునస్వామి

2వ శతాబ్దానికి పూర్వం జొన్నవాడ ఓ కుగ్రామం. ఇక్కడ పెన్నా నదిలో చేపల వేటతో జీవనం సాగించే జాలర్లలో ఓ జాలరుకు వలలో చేపలకు బదులు ఓ శిలావిగ్రహం లభ్యమైంది. ఆ విగ్రహాన్ని జాలర్లంతా ప్రస్తుతం ఉన్న ఆలయ పరిసర ప్రాంతంలోని ఓ చోట ప్రతిష్ఠించి నిత్యం మాంస, శాఖాహారాలను నివేదించేవారు. పరిణామ క్రమంలో ఆ శిలా విగ్రహంలోనుంచి ఓ ఆదిశక్తి రూపం అర్ధరాత్రి పూట గ్రామంలో తిరుగుతూ ఎదురుపడ్డ మనుషులు, మూగజీవాలను బలితీసుకునేదని స్థానిక పెద్దలు నేటికీ చెబుతుంటారు.

● కామాక్షితాయిగా పునఃప్రతిష్ఠ


దేశ పర్యటనలో భాగంగా కంచి కామకోటి పీఠాధిపతి (మొదటి) జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు జొన్నవాడ పెన్నానదీ తీరాన బస చేశారు. ఆ రాత్రి శంకరాచార్యుల దివ్యదృష్టికి ఆ ప్రాంతంలో సంచరించే ఆదిశక్తి రూపన్ని పసిగట్టి ఆ శక్తిరూపాన్ని అడ్డుకుని ఆ విగ్రహంలోని ఆదిశక్తిని పార్వతీలి లక్ష్మి, సరస్వతి, రాజరాజేశ్వరి అంశాలను నెలకొల్పి 'కామాక్షితాయి' అని నామకరణం చేశారని చెబుతారు. అప్పటి నుంచి అమ్మవారి ఆలయంలో ఆదిశంకర పీఠం ఆచార సంప్రదాయాలతో శాస్త్రోక్తంగా పూజలు, అభివృద్ధి జరుగుతోంది.


కామాక్షితాయి అమ్మవారు

● కశ్యపతీర్థం

కశ్యప్రజాపతి జొన్నవాడలోని ఆలయం పక్కన పెన్నానది వద్ద యజ్ఞం చేసిన రేవే పవిత్ర కశ్యప తీర్థం రేవుగా పిలుస్తారు. శాపగ్రస్థుడైన అశ్వద్ధ మహాముని కుష్టువ్యాధితో బాధపడుతూ జొన్నవాడలోని కశ్యపతీర్థం రేవులో స్నానమాచరించి వ్యాధి నుంచి విముక్తి పొందాని పండితులు తెలిపారు.


కశ్యప్రజాపతి చేసిన యజ్ఞంలోనుంచి ఆవిర్భవించిన మల్లికార్జునస్వామి


పెన్నానదిలో జాలర్లకు వలలో అమ్మవారు దొరికినట్టు అంతరాలయంలో చెక్కబడిన చిత్రం

● మల్లికార్జునస్వామి స్వయంభువు

త్రేతా యుగంలో కశ్యప్రజాపతి జొన్నవాడ పెన్నానది ఒడ్డున త్రేతాగ్నులను నెలకొల్పి యజ్ఞం చేయగా ఆ యజ్ఞంలో ఓ కుండలం నుంచి సాక్షాత్తు పరమ శివుడు లింగాకారంతో ఆవిర్భవించారు. మల్లికార్జునుడనే నామంతో జొన్నవాడలో భక్తుల కోర్కెలు తీర్చేలా స్కంధపురాణంలో పేర్కొనబడి ఉన్నట్టు పండితులు చెబుతున్నారు. అలా సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరులే పవిత్ర పెన్నానదీ తీరాన వెలసి భక్తజనం పూజలతో జొన్నవాడ (రజితగిరి) పుణ్యక్షేత్రంగా అలరారుతోంది.

● భక్తులకు స్వప్న దర్శనంతో వరాలు

ఆలయంలో నద్రించిన భక్తులకు ఆదిదంపతులు స్వప్న దర్శనంలో కోరిన కోర్కెలు తీరుస్తుంటారు. ప్రధానంగా సంతానలేమితో బాధపడే మహిళలు బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాల సమయంలో 10రోజుల పాటు తడిబట్టలు, ఉపవాసాలతో కఠోర దీక్షబూని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిముఖంగా నిద్రించి సంతాన వరాలు పొంది ఏడాదికి తిరిగి బిడ్డతో స్వామి, అమ్మవార్లను దర్శిస్తుంచుకుంటారు. ఇక నిత్యాన్నదానానికి భక్తులు లక్షలాది రూపాయలు విరాళాలుగా సమర్పిస్తుంటారు. ఆరోగ్య, ఆర్థిక, విద్య, సంతాన, మానసిక సమస్యలు, సకల సమస్యలతో సతమతమవుతూ స్వామి, అమ్మవారి శరణుకోరి వచ్చే భక్తులను కాపాడుకుంటున్నారు.


జీజీహెచ్‌లో కమిటీ సభ్యులు, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

దాతల సహకారంతో మౌలిక వసతులు

● జిల్లా కలెక్టర్ ఆనంద్

● జీజీహెచ్‌లో ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం

నెల్లూరు(వైద్యం), మే 17(ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, వైద్యులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. శనివారం జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రసూతి విభాగంలో మొక్కలు నాటారు. అక్కడ ప్రత్యేక గదులను పరిశీలించి ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఈ గదులు కేటాయించి రుసుము వసూలు చేయాలన్నారు. హెచ్ఐవీ విభాగంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎముకలు, కీళ్ల విభాగంలో కంప్యూటర్ ద్వారా ఎక్స్‌రే ఎలా తీస్తారో స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు దాతల సహకారం కోసం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసులగౌడ్, సభ్యులు మల్లికార్జున, అబిదా సుల్తానా, మొగరాల సురేష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్లు వినయ్‌కుమార్, గీతాలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసం పొగాకు రైతుల ఆందోళన

కలిగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. రెండు నెలల క్రితం పొగాకు కొనుగోళ్ల ప్రారంభం అయినప్పటికీ ధరల్లో పెరుగుదల కనబడలేదన్నారు. పొగాకు కంపెనీలు సిండికేట్‌గా మారి కేవలం మొదటి రకం గ్రేడ్ పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తున్నాయన్నారు. మీడియం, లోగ్రేడ్ పొగాకును వేలం కేంద్రానికి తీసుకువస్తే నోబిడ్ ప్రకటిస్తూ తిరస్కరిస్తున్నారన్నారు. ఈవిధంగా తిరస్కరిస్తున్న బేళ్లను తిరిగి ఇళ్లకు తీసుకువెళ్లాలంటే కష్టతరంగా మారిందన్నారు. రైతులు పండించిన అన్నిరకాల పొగాకు గ్రేడ్‌లను కొనుగోలు చేస్తామని హామీ ఇస్తేగాని ఆందోళన విరమించమని కొంతసేపు వేలం ప్రక్రియను అడ్డుకున్నారు. దీంతో వేలం నిర్వహణ అధికారి ఇసాక్‌స్వరణ్‌దత్ రైతులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి కంపెనీలు కొనుగోలు చెయ్యటం జరుగుతుందన్నారు. రైతుల ఆందోళనను బోర్డు దృష్టికి తీసుకువెళ్లి అన్నిరకాల పొగాకు గ్రేడ్‌లను కొనుగోలు చేస్తామనడంతో రైతులు ఆందోళన విరమించారు.

'అమృత్'పై చర్చా వేదికకు రా!

● పథకంలో జరిగిన అవినీతిని బయటపెడతా

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కు కావలి ఎమ్మెల్యే సవాల్

కావలి, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అమృత్ పథకం కింద మంజూరైన రూ.57 కోట్లలో జరిగిన అవినీతిపై త్వరలో ఏర్పాటు చేయనున్న చర్చా వేదికకు దమ్ముంటే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వచ్చి సమాధానం చెప్పాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సవాల్ విసిరారు. రోడ్డు మార్జిన్ వ్యాపారుల కోసం నిర్మించిన మున్సిపల్ వాణిజ్య సముదాయం దుకాణాలను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. 'అమృత్ ఫైలాన్ కనిపిస్తే ఎక్కడ ఆ నిధులు గుర్తుకు వస్తాయోనని దానిని ప్రెస్‌క్లబ్ పేరు చెప్పి ధ్వంసం చేయించారని అన్నారు. అలాగే ప్రతాప్‌రెడ్డి చేసిన అవినీతి ఎక్కడ బయటకు వస్తోందోనని మున్సిపాలిటీకి ఎన్నికలు కూడా జరగకుండా చేశారని అన్నారు. అమృత్‌పథకం నిధులు దుర్వినియోగంపై తగిన ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా త్వరలో చర్చావేదిక ఏర్పాటు చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించనున్నట్లు తెలిపారు. దానిపై విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించనున్నట్లు చెప్పారు.

● జూన్ 21న సీఎం రాక

కావలి నియోజకవర్గానికి మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కావలికి ఆహ్వానించానని, జూన్ 21న ఆయన వస్తారని ఎమ్మెల్యే తెలిపారు. జువ్వలదిన్నె ఫిసింగ్ హార్బర్ ప్రారంభోత్సవంతోపాటు కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులకు మంజూరైన రూ.17 కోట్లతో శంకుస్థాపన వంటి కార్యక్రమాలు సీఎం చేతుల మీదుగా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, టీడీపీ నేతలు కిషోర్, వెంకటేశ్వర్లు, మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, వెంకటేశ్వర్లు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులో అక్రమ చేపలవేటపై దాడి

● జాలర్లపై చర్యలు కరువు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో అక్రమ చేపలవేటపై మత్స్యశాఖాధికారులు శనివారం దాడులు నిర్వహించారు. చేపలను జలాశయం ఎగువ నుంచి ఒడ్డుకు చేరుస్తుండగా కొందరు జాలర్లను తనిఖీ చేశారు. వారి వద్ద లైసెన్సులు లేక పోవడంతో సంపదను స్వాధీనం చేసుకున్నారు. చేపలను వేలం వేయగా రూ 4,500 సమకూరిందన్నారు. ఆ నగదును ప్రభుత్వంకు జమ చేసినట్లు ఏడీ శ్రీనివాసులు తెలిపారు. కాని పట్టుబడిన జాలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై ఏడీ మాట్లాడుతూ మొదటి తప్పుగా వారిని వదిలేశామని, రెండో సారి దొరికితే చర్యలు తీసుకుంటామని చెప్పడం కొసమెరుపు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. సింగనబోయిన కుమారి అనే మహిళపై ఆవుల రత్తయ్య, జక్కుల బాలకృష్ణలు తనతోపాటు తన కుటుంబ సభ్యులు, అడ్డువచ్చిన వారిపై దాడి చేసి, దుర్భాషలాడి కర్రలతో ఇంటిపైకొచ్చారని ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎస్ఎస్ఏలో పారెన్ సర్వీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న పారెన్ సర్వీస్ పోస్టుల్లో డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన ఎస్ఏల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీ నాటికి 55 ఏళ్ల లోపు వయస్సు కలిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్లు అర్హులని పేర్కొన్నారు. వీరు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎస్ఎస్ఏ కార్యాలయంలో దరఖాస్తులు అందచేయాలని తెలిపారు. విద్యార్హతలు, మార్కుల జాబితాలు, అనుభవం, ఇతర అన్ని సర్టిఫికెట్స్‌పై సంబంధిత అధికారితో అటెస్టెట్ చేయించి దరఖాస్తులకు జతపరిచి స్వయంగా కార్యాలయంలో అందించాలని తెలిపారు.

● 22న సెక్టోరియల్ పోస్టులకు రాత పరీక్ష

సమగ్రశిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ఈనెల 22వ తేదీన నగరంలోని పత్తేఖాన్‌పేట మునిసిపల్ ఉన్నత పాఠశా లలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 వరకు అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఎంఐఎస్ మరియు ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు, 3 నుంచి 5 గంటల వరకు అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ పరీక్షకు తప్పక హాజరు కావాలని తెలిపారు.

క్వార్ట్జ్ కేసులో విచారణ

నెల్లూరు (క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో నోటీసులు అందుకున్న మాజీ మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మందల వెంకటశేషయ్య శనివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఆయనతోపాటు సురేష్‌కుమార్‌రెడ్డి విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మీడియాతో మాట్లాడుతూ డీఎస్పీ విచారణ కోసం బయటకు వెళ్లారని, ఆయన వచ్చాక సమాచారం అందిస్తామని అప్పుడు విచారణకు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరయ్యేదుకు సిద్ధంగా ఉన్నామని, ఈ కేసులో తమ పాత్ర ఏమీలేదనానరు. ఈ నెల 30వ తేదీ వరకు తాను జిల్లాలో ఉండనని, ఆపై ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని తెలిపారు.

గడ్డివామి దగ్ధం: రూ. 50 వేల నష్టం

సంగం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవపాళెంలో వెంకటరమణయ్య అనే రైతుకు చెందిన గడ్డివామి శనివారం దగ్ధమైంది. వెంకటరమణయ్యకు పాడి పశువులు ఉండడంతో వాటికి మేత కోసం ఇటీవల గడ్డి కొనుగోలు చేసి రహదారి పక్కన ఖాళీ స్థలంలో ఉంచాడు. పక్కనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. ఈ క్రమంలో గాలులకు విద్యుత్ తీగలు రాసుకుని నిప్పులు ఏర్పడి గడ్డివామికి మంటలు ఏర్పడి ఉంటాయని స్థానికులు తెలుపుతున్నారు. ఈ సంఘటనతో సుమారు రూ. 50 వేల మేర నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

రాపూరు వాసి దారుణ హత్య


ఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసు అధికారులు


షఫీ (ఫైల్

రాపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో వరుస హత్యలతో ప్రజలు హడలి పోతున్నారు. తాజాగా రాపూరు మండలంలో ఓ దారుణ హత్య కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాపూరు పట్టణానికి చెందిన షేక్. షఫీ (52) ఆర్టీసీ కూడలి వద్ద కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి బయలుదేరాడు. కానీ ఎంత సేపటికి ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు షఫీ కోసం గాలించారు. అయితే శనివారం ఉదయం రాపూరు మండలంలోని తాతిపల్లి సమీపంలో ఓ వ్యక్తి హత్యకు గురైనట్లు అక్కడి స్థానికులు కండలేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు షఫీగా నిర్ధారించారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఆత్మకూరు సీఐ గంగాధర్, రాపూరు సీఐ సత్యనారాయణ, కండలేరు ఎస్ఐ రామకృష్ణ, డాగ్ స్క్వాడ్ చేరుకుని పరిశీలిస్తున్నారు. షఫీ ఎలా హత్యకు గురయ్యాడు, కారణాలేమిటనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహన్ని పోస్టుమారం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం జరుపుతున్న అర్చకులు

సీతారామపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : సీతారామపురం గ్రామ పంచాయతీలోని సంగసానిపల్లి గ్రామంలో శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆకాశ మంత పందిరి, భూదేవంత పీట. పచ్చని తోరణాలు స్వాగతం పలుకుతుండగా మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో శ్రీరామ చంద్రుడ్ని కల్యాణమండపానికి తరలించారు. మండపానికి చేరుకున్న సీతమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు పారవశ్యంలో మునిగిపోయారు.శ్రీరామునికి సీతమ్మనిచ్చి కన్యాదానం నిర్వహించారు. అర్చకుల వేద మంత్రాల మధ్య శ్రీరాముడు సీతమ్మకు మంగళ సూత్రధారణ చేశారు.కల్యాణాన్ని వీక్షించుటకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటపల్లి గ్రామంలో శనివారం సీతారాముల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అర్చకులు స్వామి వార్లకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం అడ్డదారులు

● కార్పొరేట్ విద్యాసంస్థలో వింత పోకడ

● పోటీ సంస్థల విద్యార్థులకు అన్యాయం జరిగేలా ప్రయత్నాలు

● ఇంటర్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు

● సమగ్ర విచారణకు ఆదేశం

కందుకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : 'అందరికన్నా మేటిగా మా విద్యాసంస్థ ఫలితాలు సాధించింది. మేమే టౌన్ ఫస్ట్... మేము జిల్లా ఫస్ట్ అని ప్రచారం చేసుకోవటం కోసం ఆయా విద్యాసంస్థలు సకలప్రయత్నాలు చేస్తుంటాయి. అడ్డదారిలోనైనా అత్యధిక మార్కులు సాధిస్తే అడ్మిషన్లు ఘనంగా ఉంటాయని విద్యాసంస్థల నిర్వాహకులు పరీక్షల సమయంలో నానాతంటాలు పడుతుంటారు. ఇన్విజిలేటర్లను మచ్చిక చేసుకోవడం, కాపీ కొట్టించడం, మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి నాలుగు మార్కులు అదనంగా వచ్చేలా చూసుకోవడం ద్వారా అగ్రగామిగా నిలవాలని పడరాని పాట్లు పడటం మనం చూస్తూనే ఉంటాం. అయితే కందుకూరులో కేవలం వారి ఉన్నతిని చాటుకోవటానికి అడ్డదారులు తొక్కడమే కాదు.. తమది పైచేయి అని చూపించుకోవడానికి ఎదుటివారి చేతిని బలవంతంగా దించేసే ప్రయత్నాలు జరిగాయి. ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలలో ఓ ప్రైవేటు విద్యాసంస్థ ఈ దారుణ చర్యలకు ఒడిగట్టిన విషయం రీ వెరిఫికేషన్‌లో వెలుగులోకి వచ్చింది. విద్యాశాఖ అధికారులు, బాధిత విద్యార్థులు చెప్పిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

● ఇన్విజిలేటర్‌పై ఫిర్యాదు

కందుకూరులోని ఓవీ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ముప్పనేని అవినాష్‌బాబు, తన్నీరు సాయితేజశ్వినిలు ఎంపీసీ పూర్తిచేశారు. వీరిలో అవినాష్‌బాబుకు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 470కి 464 మార్కులు, సాయితేజశ్వినికి 466 మార్కులు వచ్చాయి. అయితే ద్వితీయ సంవత్సరం వచ్చేసరికి అవినాష్‌బాబుకు వెయ్యికి 971 మార్కులే రాగా సాయితేజశ్వినికి 983 మార్కులు వచ్చాయి. వాస్తవానికి వీరిద్దరూ సదరు విద్యాసంస్థలో టాపర్స్. అయితే వీరికన్నా అకడమిక్‌లో వెనుకబడిన విద్యార్థులకు అధిక మార్కులు వచ్చాయి. వీరిద్దరూ పట్టణంలో పేరెన్నికగల ఓ ప్రైవేటు కళాశాలలోని పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాశారు. దీంతో అనుమానం వచ్చి రీ వెరిఫికేషన్‌కు పెట్టించగా అవినాష్, సాయితేజశ్విని ఇంగ్లీష ఆన్సర్ సీట్లు ట్యాంపరింగ్ జరిగినట్లు ఉన్నతాధికారులు నిర్ధారించారు. ఇంగ్లీష్ ఎగ్జామినేషన్‌లో ఇన్విజిలేటర్‌గా ఉన్న జీ.కృష్ణారావు ఆ విద్యార్థులు ఆన్సర్ సీటు ఇచ్చి వెళ్లేటప్పుడే 'మీరు 5 మార్కులు అనవసరంగా పోగొట్టుకున్నారుగా..' అని మాట్లాడటాన్ని గుర్తుచేసుకుని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు సమగ్ర విచారణకు ఆదేశించారు. సదరు విద్యాసంస్థలో ప్రస్తుతం సప్లిమెంటరీ పరీక్ష సెంటర్‌లో ఇన్విజిలేటర్లను పూర్తిగా మార్చివేసి ప్రభుత్వ అధ్యాపకులతో నడిపిస్తుండటం విశేషం. ఈ వ్యవహారాన్ని నిగ్గుతేల్చి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవటంతోపాటు ఆ విద్యార్థులకు మార్కులు సవరించి న్యాయం చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభయమిచ్చారని బాధిత విద్యార్థులు అవినాష్‌బాబు, సాయితేజశ్విని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.